విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :29 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 23 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# తల్లి ఆశయం.. తండ్రి సంకల్పం.. 25 ఏళ్ల బసవతారకం సేవాయజ్ఞం

- బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి
- బసవతారకం స్ఫూర్తితో ఎన్టీఆర్ స్థాపించిన సేవాసంస్థ
- ఛైర్మన్ బాలకృష్ణ సారథ్యంలో ఏటా లక్షలాది మందికి అందుబాటులో వైద్యం
- భవిష్యత్ ప్రణాళికగా అమరావతిలో 1000 పడకల కొత్త ఆసుపత్రి నిర్మాణం
- రజతోత్సవం సందర్భంగా 45,000 మందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ ఏ ఒక్క పేదవాడు ప్రాణాలు కోల్పోకూడదని, మరే కుటుంబంలోనూ ఇటువంటి విషాదం నిండకూడదని తన మాతృమూర్తికి ఇచ్చిన మాట మేరకు ఆ నిబద్ధత కొనసాగుతోంది. శోకం నుంచి శ్లోకం పుట్టి రామాయణం ఆవిర్భవించినట్లుగానే, తల్లిని కోల్పోయిన ఆవేదన నుంచి నందమూరి కుటుంబం సమాజం పట్ల ఒక గొప్ప బాధ్యతను భుజానికెత్తుకుంది. మహానాయకుడు ఎన్టీఆర్ తన భార్య స్మారకార్థం బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. మాతృమూర్తికి ఇచ్చిన మాటకు కట్టుబడి, సమాజ శ్రేయస్సు కోరి గత 25 ఏళ్లుగా ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యాన్ని ఈ సంస్థ ద్వారా అందిస్తున్నారు. ట్రస్ట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ తన సహచర సభ్యుల సహకారంతో ఈ ఆసుపత్రిని ఒక సేవా యజ్ఞంలా నిర్వహిస్తున్నారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రజతోత్సవ వేడుకలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సాధించిన మైలురాళ్లను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆసుపత్రి ఆరంభం నుంచి నేటి వరకు పెరిగిన వైద్య సౌకర్యాలు, అత్యాధునిక చికిత్సా విధానాలు, రోగులు మరియు వారి బంధువులకు కల్పిస్తున్న

వివరాలు 2లో..

## భారత్ అభివృద్ధిని చూసింది

- విధ్వంసాన్ని కూడా ఎదుర్కొంది
- క్షణిక సంఘటనలతో అస్థిరపడిపోం
- వెయ్యేళ్ల భవిష్యత్తుకు పునాది వేస్తున్నాం
- భారత ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



భారతదేశం కేవలం ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాదు ప్రపంచానికి నమ్మకమైన భాగస్వామిగా, విశ్వసనీయ శక్తిగా అవతరించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రపంచ సరఫరా గొలుసులు, సాంకేతికత, పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాల్లో భారత్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకం పెరుగుతోందన్నారు. రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రిపబ్లిక్ సమిట్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు కేవలం ఈ తరానికే కాకుండా వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్తును నిర్మిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. భారతదేశం అనేది తాత్కాలిక లేదా క్షణిక సంఘటనలకు స్పందించి

వివరాలు 2లో..

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

- కోచింగ్ సెంటర్‌లో మంటలు
- 14మంది దుర్మరణం, ఇద్దరికీ తీవ్ర గాయాలు
- చర్యలకు దిగిన యూపి సీఎం యోగి
- ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి



ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది.

వివరాలు 2లో..



## ఆహార భద్రత లోపాలపై చర్యలు తీసుకోండి

### ప్రభుత్వాన్ని కోరిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఆహార భద్రతా వ్యవస్థలో లోపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కల్తీ పాలు, నకిలీ మసాలాలు, నాసిరకం ప్యాకేజ్డ్ ఫుడ్, కలుషిత తాగునీరు, అపరిశుభ్ర మాంసం అమ్మకాలపై జనతా వారధి కార్యక్రమానికి ఫిర్యాదులు, వినతులు వస్తుండడం ఆందోళన కలిగిస్తోందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆహార భద్రత అమలులో కీలకమైన ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత తీవ్రంగా ఉండడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఖాళీలు భర్తీ చేసి, జిల్లాకో మినీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేయాలి. ఆహార సంస్థలకు లైసెన్సులు తప్పనిసరి చేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం దుకాణాల్లో పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించాలి. అక్రమ వధశాలలను మూసివేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆహార భద్రత తనిఖీలు చేపట్టాలి. ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు 24x7 ఫుడ్ సేఫ్టీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి' అని ప్రభుత్వాన్ని మాధవ్ కోరారు.

## ఢిల్లీలో మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను సత్కరించిన మంత్రి నారా లోకేశ్

- మంగళవారం నాడు పద్మశ్రీ పురస్కారాలు అందుకోనున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- తెలుగు సినిమాకు వన్నెతెచ్చారని నటులను కొనియాడిన మంత్రి లోకేశ్
- ఈ సత్కారంలో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు
- ఎన్టీఆర్‌తో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాలను అందుకునేందుకు ఢిల్లీకి విచ్చేసిన ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. మంగళవారం నాడు ఢిల్లీలో జరగనున్న పద్మ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఈ ఇద్దరు సీనియర్ నటులను లోకేశ్ కలుసుకుని, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. వందలాది చిత్రాలలో నటించి, తెలుగు చిత్రసీమకు వన్నె తెచ్చిన ఇద్దరు దిగ్గజ నటులకు ఏకకాలంలో పద్మశ్రీలు దక్కడం రాష్ట్రానికే గర్వకారణమని ఈ సందర్భంగా లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా, దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారితో తమకున్న సాన్నిహిత్యాన్ని మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులోనూ తెలుగు కళామతల్లికి తమ సేవలను కొనసాగించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొని మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను అభినందించి సన్మానించారు.

## ఖతార్ గ్యాస్ ప్లాంట్ పేలుడులో 12 మంది భారతీయుల సజీవ దహనం



- బర్జన్ గ్యాస్ ప్లాంట్‌లో ఆదివారం రాత్రి భారీ పేలుడు
- మృతి చెందిన 13 మందిలో 12 మంది భారతీయులే
- మరో 66 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మృతదేహాలను స్వదేశానికి రప్పించేందుకు భారత రాయబార కార్యాలయం చర్యలు

వివరాలు 2లో..

## దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్ హోతో లోకేశ్ భేటీ



భారత్‌లో దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్ హోను మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారత్‌లో కొరియన్ కంపెనీల విస్తరణ, భవిష్యత్తులో ఇరుదేశాల నడుమ మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సెమీకండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, నౌకా నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహన రంగాల్లో కొరియా ప్రపంచ అగ్రగామిగా ఉంది. కొరియన్ కంపెనీలకు ఏపీ ఎలా దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదో మంత్రి లోకేశ్ వివరించారు.

## ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి



- బసవతారకం ఆసుపత్రి 25 ఏళ్ల వేడుకలో భావోద్వేగంగా ప్రసంగించిన బాలకృష్ణ
- తల్లి కోరిక, తండ్రి ఆశయంతోనే ఈ సంస్థ ఏర్పాటైందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాతలు, ప్రభుత్వాల సహకారాన్ని గుర్తుచేసుకున్న బాలయ్య
- అమరావతిలో 1000 పడకలతో మరో ప్రపంచ స్థాయి క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం
- వైద్యులు, సిబ్బంది సేవలను కొనియాడిన బాలకృష్ణ

వివరాలు 2లో..

## స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు కేఆర్ఈఏ వర్సిటీతో ఒప్పందం



'స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 15% వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. 2014-19 మధ్య 13.5% సాధిస్తే ప్రస్తుతం 11% సాధించాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం-కేఆర్ఈఏ (క్రియా) యూనివర్సిటీ

వివరాలు 2లో..

# ఖతార్ గ్యాస్ ప్లాంట్ పేలుడులో 12 మంది భారతీయుల సజీవ దహనం

-మొదటిపేజీ తరువాయి

ఖతార్‌లోని ప్రముఖ ఇంధన ఉత్పాదక కేంద్రమైన రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన భారీ పేలుడులో మరణించిన 13 మందిలో 12 మంది భారతీయులు ఉన్నట్టు అధికారులు ధ్రువీకరించారు. మరొకరు పాకిస్థాన్ జాతీయుడని తెలిపారు. పేలుడు తీవ్రతకు ప్లాంట్‌లో పనిచేస్తున్న మరో 66 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంపై ఖతార్ ఇంధన శాఖ సహాయ మంత్రి, 'ఖతార్ ఎనర్జీ' సీఈవో సాద్ అల్-కాబీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గతంలో ఇరాన్ క్షిపణి దాడి కారణంగా ఈ ప్లాంట్ కార్యకలాపాలకు అంతరాయం కలగడంతో, మరమ్మతుల అనంతరం ప్లాంట్‌ను పునఃప్రారంభించే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇది ఎలాంటి విద్రోహ చర్య లేదా శత్రుదేశాల దాడి కాదని, కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ పేలుడు వల్ల ఖతార్ అంతర్జాతీయ ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తికి గానీ, ఎగుమతులకు గానీ ఎలాంటి ఆటంకం కలగలేదని, పర్యావరణ ముప్పు కూడా లేదని ప్రకటించారు.

మరోవైపు దోహాలోని భారత రాయబార కార్యాలయం ఈ ఘటనపై తక్షణమే స్పందించింది. మరణించిన 12 మంది భారతీయుల వివరాలను సేకరించి, వారి కుటుంబాలకు సమాచారం అందించేందుకు కసరత్తు ప్రారంభించింది. గాయపడిన భారతీయ కార్మికులందరికీ స్థానిక ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందుతోందని, ప్రస్తుతం వారి పరిస్థితి స్థిరంగా ఉందని రాయబార కార్యాలయం ఎక్స్ ద్వారా వెల్లడించింది. బాధిత కుటుంబాలకు అవసరమైన చట్టపరమైన సాయం అందించడంతో పాటు, మృతుల భౌతిక కాయాలను వీలైనంత త్వరగా భారతదేశానికి తరలించేందుకు ఖతార్ ప్రభుత్వ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు కేఆర్ఈఏ వర్సిటీతో ఒప్పందం

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈ ఎంవోయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతో పాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం, విధానపరమైన సూచనలను ఆ ఇన్‌స్టిట్యూట్ అందిస్తుంది. మంత్రి పయ్యావుల కేశవ్, క్రియా యూనివర్సిటీ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.

## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి-బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

# తల్లి ఆశయం.. తండ్రి సంకల్పం.. 25 ఏళ్ల బసవతారకం సేవాయజ్ఞం

-మొదటిపేజీ తరువాయి

వసతులు, అలాగే భవిష్యత్తు ప్రణాళికలపై రూపొందించిన డాక్యుమెంటరీలను ఈ వేదికపై ప్రదర్శించారు.

**పేదలకు సేవచేస్తే పరమాత్ముడికి సేవ చేసినట్లేలిలి**

"మానవత్వం నా ఆదర్శం - సమాజమే దేవాలయం - పేదలే దేవుళ్లు - వారికి చేసే సేవయే పరమాత్ముడికి చేసే సేవ" అన్న ఎన్టీఆర్ ఆశయాలను బసవతారకం ఆసుపత్రి తన సిద్ధాంతంగా మలుచుకుంది. లాభాపేక్ష లేకుండా, కేవలం మానవతా దృక్పథంతో ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ 25 ఏళ్ల ప్రయాణంలో అడుగడుగునా అండగా నిలిచిన దాతలకు, నిస్వార్థంగా సేవలందించిన వైద్య నిపుణులకు, శాస్త్రవేత్తలకు, సిబ్బందికి మరియు రోగుల కుటుంబ సభ్యులకు ట్రస్ట్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ రజతోత్సవ శుభాకాంక్షలు అందించింది.

**మానవత్వంతో వైద్యంలిలి**

ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నందమూరి తారక రామారావు గారు 1988లో ఈ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గారి చేతుల మీదుగా 100 పడకలతో ఈ సేవా ప్రస్థానం ప్రారంభమైంది. ఆసుపత్రి ఆశయ సాధనలో ప్రముఖ వైద్యులు, ఎన్ఆర్ఐలు మరియు శాస్త్రవేత్తల నిరంతర సహకారం ఎంతో కీలకమైంది. రజతోత్సవ వేళ వారందరి సేవలను సంస్థ స్మరించుకుంది.

**అందరి ఆస్పత్రి.. అందుబాటులో వైద్యంలిలి**

బసవతారకం ఆసుపత్రి కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రాల రోగులకు కూడా ఆశాదీపంగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రతి ఏటా సుమారు 3 లక్షల మందికి పైగా అవుట్ పేషెంట్లకు, 90 వేల మంది ఇన్ పేషెంట్లకు ఇక్కడ చికిత్స అందుతోంది. ఇప్పటివరకు 8,000కు పైగా శస్త్రచికిత్సలు, 86 బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్లు విజయవంతంగా పూర్తి చేసి ఈ ఆసుపత్రి రికార్డు సృష్టించింది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతం కంటే ఎక్కువ మంది పేదలే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ (రావీ-జీఖ్) వంటి ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నారు.

**వీరే బలం.. బలగంలిలి**

ఆసుపత్రిలో సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలతో పాటు రేడియాలజిస్టులు, పాథాలజిస్టులు, న్యూక్లియర్ మెడిసిన్ నిపుణుల వంటి సుమారు 250 మంది నిపుణులైన వైద్య బృందం సేవలందిస్తోంది. తల, మెడ, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ప్రొస్టేట్ వంటి వివిధ రకాల క్యాన్సర్లకు ప్రత్యేక అవయవ ఆధారిత (రాతీస్త్రుఅ-ఝింవఽ) చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, రోగుల మానసిక ధైర్యం మరియు జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక 'పాలియేటివ్ కేర్' యూనిట్ ఇక్కడ విశేష సేవలందిస్తోంది.

**ఉచిత స్క్రీనింగ్ సేవలులిలి**

క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని ప్రముఖ క్రికెటర్ యువరాజ్ సింగ్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని, ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 2.7 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. క్యాన్సర్ అవగాహన కార్యక్రమాల ద్వారా మూడు ప్రపంచ రికార్డులను సైతం ఈ సంస్థ సొంతం చేసుకుంది. క్యాన్సర్ నివారణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చడంలో ట్రస్ట్ విజయవంతమైంది.

**అమరావతిలో 1000 పడకల ఆస్పత్రిలిలి**

నందమూరి బాలకృష్ణ తన తల్లికి ఇచ్చిన మాటను, తండ్రి వేసిన మార్గాన్ని అనుసరిస్తూ ఈ ఆసుపత్రిని నిస్వార్థంగా నడిపిస్తున్నారు. క్యాన్సర్ బాధితుల చిరునవ్వుల్లోనే ఆయన తృప్తిని వెతుక్కుంటున్నారు. రజతోత్సవం సందర్భంగా సేవలను మరింత విస్తరించాలని ట్రస్ట్ నిర్ణయించింది. భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా అమరావతిలో 1,000 పడకలతో భారీ క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు చైర్మన్ నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. "కష్టతరమైన మార్గాలు కొన్నిసార్లు అద్భుతమైన గమ్యస్థానాలకు దారి తీస్తాయి" అన్న క్యాన్సర్ సర్వైవర్ కియా వైన్ మాటలను ట్రస్ట్ సభ్యురాలు నారా బ్రాహ్మణి ఈ సందర్భంగా గుర్తు చేశారు. లక్షలాది మంది బాధితులకు కొత్త జీవితాన్ని ఇచ్చే దిశగా ఎన్.బి.టి.ఆర్.సి.ఎఫ్ (చీదీ=జఖీ) ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సేవా ప్రయాణంలో తమ కుటుంబం మూడు తరాలుగా భాగస్వామ్యం కావడం ఒక గొప్ప వరంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా 45,000 మందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించామని, అందులో 25,000 మంది మహిళలే ఉన్నారని ఆమె వివరించారు.

## ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి

-మొదటిపేజీ తరువాయి

"ఈ రోజు నేను మీ ముందు ఒక నటుడిగానో, ప్రజాప్రతినిధిగానో నిలబడలేదు. ఒక కొడుకుగా ఈ వేదికపై ఉన్నాను" అంటూ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, నందమూరి బాలకృష్ణ తన ప్రసంగాన్ని భావోద్వేగభరితంగా ప్రారంభించారు. ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన తల్లి బసవతారకం క్యాన్సర్‌తో పోరాడుతున్న రోజులను గుర్తుచేసుకుంటూ, ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న ఆశయాన్ని వివరించారు. 1984లో తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పుడు, తమకు చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత ఉందని, కానీ చుట్టూ ఉన్న ఎందరో నిస్సహాయులను చూసి తన తల్లి ఆవేదన చెందారని బాలకృష్ణ తెలిపారు. "డబ్బులున్న మనం చికిత్స చేయించుకోగలుగుతున్నాం, మరి పేదల పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన ఒక సామాన్యమైన ప్రశ్నే ఈ బృహత్తర కార్యక్రమానికి పునాది వేసిందన్నారు. ఆ ప్రశ్నను తన తండ్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు ఒక బాధ్యతగా స్వీకరించి, డబ్బు లేదన్న కారణంతో ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదన్న లక్ష్యంతో 1989లో ఈ సంస్థకు పునాది వేశారని గుర్తుచేసుకున్నారు.

2000వ సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ఆసుపత్రి, నేడు 650 పడకల ప్రపంచ స్థాయి వైద్యశాలగా ఎదిగిందని బాలకృష్ణ వివరించారు. ప్రతిరోజూ 35 నుంచి 40 సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు, 200 మందికి పైగా కీమోథెరపీ, దాదాపు 500 మందికి రేడియేషన్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 3.75 లక్షల మందికి పైగా రోగులకు ఇక్కడ చికిత్స అందించినట్లు వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ, పీఎంజేఏవై వంటి ప్రభుత్వ పథకాలు లక్షలాది మంది ప్రాణాలను కాపాడాయని చెబుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల వరకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు, తానా, నాట్స్ వంటి విదేశీ తెలుగు సంఘాలు, దాతలు, అభిమానుల సహకారం మరువలేనిదన్నారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది కేవలం ఉద్యోగం చేయట్లేదని, ప్రాణాలను నిలబెట్టే బాధ్యతను మోస్తున్నారని వారి సేవలను కొనియాడారు.

ఈ ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, అమరావతిలో 1000 పడకలతో మరో ప్రపంచ స్థాయి క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిని కూడా మరింత విస్తరిస్తున్నట్లు తెలిపారు. డబ్బు లేక ఏ రోగి నిస్సహాయంగా వెనుదిరగకూడదన్న తమ తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చే వరకు ఈ ప్రయాణం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## భారత్ అభివృద్ధిని చూసింది

మొదటిపేజీ తరువాయి..

ఉద్వేగానికి లోనయ్యే దేశం కాదన్నారు. 'భారత్ అభివృద్ధిని చూసింది. విధ్వంసాన్ని కూడా ఎదుర్కొంది. క్షణిక సంఘటనలతో అస్థిరపడిపోం. వీటన్నింటినీ తట్టుకొని నిలబడిన చైతన్యం మనది. వేల ఏళ్ల నాగరికత



అనుభవాన్ని మోస్తున్నాం. ఎంతో నమ్మకంతో, బాధ్యతతో చెబుతున్నా. నేడు భారత్ చేస్తున్న ప్రతి పని, తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు రాబోయే వెయ్యి సంవత్సరాల దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయి' అని మోదీ వివరించారు. ఈ సందర్భంగా మోదీ ధర్మం గురించి కూడా ప్రస్తావించారు. ధర్మం అంటే కర్తవ్యం, న్యాయం, సంభాషణ, కరుణ వంటి విలువల సమాహారం అని చెప్పారు. భారతదేశం శక్తిని ఇదే దృక్పథంతో, ఇదే కోణంలో చూస్తుందని వివరించారు. ఇటీవల జీ7 సదస్సులో పాల్గొని వచ్చిన విషయాన్ని మరోసారి గుర్తు చేసిన మోదీ- ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్‌కు ఉన్న ప్రాధాన్యతను గుర్తిస్తున్నాయని చెప్పారు. 'నేటి భారతదేశానికి నేషన్ ఫస్ట్ అనేదే ప్రథమ ప్రాధాన్యం, మార్గదర్శక సూత్రం అని ప్రపంచంలోని ప్రతి దేశం, అంతర్జాతీయ నేతలు స్పష్టంగా అర్థం చేసుకున్నారు.' అని మోదీ వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో భారత్ సాధించిన ప్రతి విజయం వెనుకా ఈ సూత్రమే ఉందని, దేశ ప్రజలంతా తమ విధుల్ని సక్రమంగా నిర్వహించడం వల్లే అన్ని కార్యక్రమాలు విజయవంతమయ్యాయని కొనియాడారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. రాజ్యాంగం పేరుతో నేడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నవారు గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పేదల పరిస్థితిని పట్టించుకోలేదని మోదీ ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం గురించి ప్రస్తావించినందుకే ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లోనూ కాంగ్రెస్ నేతలు అప్పుడు మౌనంగా ఉన్నారని ఆరోపించారు. 2014 తర్వాత తమ ప్రభుత్వం 'నేషన్ ఫస్ట్' భావనతోనే ముందుకు సాగిందని తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోనూ భద్రతతో పాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయన్నారు. బస్తర్‌లో ఒకప్పుడు బాంబులు, తుపాకుల సంస్కృతి ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు క్రీడలకు కేంద్రంగా మారిందన్నారు ప్రధాని. బస్తర్ ఒలింపిక్స్‌లో లక్షలాది యువత పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు పెరగడం అనేది అసంతృప్తిని సూచించదని, ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం అని మోదీ అన్నారు. ఈ సందర్భంగానే మోదీ కాంగ్రెస్ పార్టీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ప్రజలే కాదు కాంగ్రెస్ పార్టీ కూడా మోదీజీ ఇది చేయాలి. అది చేయాలని చెబుతోంది. ఎందుకంటే ఎవరు చేస్తారని నమ్మకం ఉంటే వారినే ప్రజలు ఆశ్రయిస్తారు. అదే నమ్మకం ప్రజల్లోనూ, ప్రత్యర్థుల్లోనూ ఉంది' అని మోదీ చమత్కరించారు. ఇదే సమిట్‌లో పాల్గొన్న జోహో ఫౌండర్ శ్రీధర్ వేంబును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. దేశ అవసరాల్ని అర్థం చేసుకొని 'నేషన్ ఫస్ట్' అనే భావనతో పనిచేసే పారిశ్రామిక వేత్తలు సంస్థల్ని మాత్రమే కాదు, దేశాన్ని కూడా ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో వివాటెక్ ప్రదర్శనలో జోహో స్టాల్ వద్ద భారీగా యువత గుమిగూడటాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని, యూరప్ యువత జోహో గురించి తెలుసుకునేందుకు చూపిన ఆసక్తి తనకు చాలా గర్వంగా అనిపించిందని మోదీ అన్నారు. భారత సంస్థలు ప్రపంచ వేదికలపై ఇలా ప్రత్యేకంగా గుర్తింపు పొందుతుండటం దేశ ఆవిష్కరణ శక్తికి నిదర్శనం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత

మొదటిపేజీ తరువాయి..

కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ఃసబీఫు) ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మొదటిపేజీ తరువాయి..

భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

మొదటిపేజీ తరువాయి..

సోమవార రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. తంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకిత భావంతో పనిచేయాలి.





- అర్జీలు పునరావృతం కాని విధంగా అధికారులు పరిష్కరించాలి.
- అర్జీలు పునరావృతం అయితే అధికారులదే బాధ్యత.
- భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్య మైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై శ్రీనివాసరావు, జడ్పీ డిప్యూటీ సీఈఓ వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, కావున పి జి ఆర్ ఎస్ కు విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 135 అర్జీలు అందాయి. అదే విధంగా రెవెన్యూ క్లినిక్ కు 172 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

# కమిషనర్ గా వసంతకాలం సంతృప్తినిచ్చింది.



- స్వచ్ఛ విశాఖ లక్ష్యంగా నగర అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపట్టాం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 22:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ తన అనుభవాలను జీవీఎంసీ ఉన్నతాధికారులు, అధికారులతో పంచుకున్నారు. జీవీఎంసీ కమిషనర్గా గడిపిన సంవత్సరం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు.

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు కమిషనర్ కేతన్ గార్గ్ కు ఏడాది కాలం పూర్తి సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అధికారులు పుష్పగుచ్చాను అందించి శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధికి రూపొందించిన కార్యాచరణలో జీవీఎంసీ యంత్రాంగం, ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, సిబ్బంది అందించిన సహకారం ఎంతో అభినందనీయమని తెలిపారు.

ఒక టీమ్గా పనిచేయడం వల్లనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని, నా ఈ ఏడాది కాలం పూర్తి వెనుక జీవీఎంసీ యంత్రాంగం సమిష్టి కృషి ఎంతో ఉందని కమిషనర్ పేర్కొన్నారు. 2025 జూన్ 17 న ప్రభుత్వం తనను జీవీఎంసీ కమిషనర్ గా నియమించిందని, వెంటనే అప్పటికే కొనసాగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నమై, ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. అనంతరం జూన్ 21 న జీవీఎంసీ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్గా పనిచేసిన అనుభవం విశాఖలో చేపట్టిన కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడిందని, ఇక్కడ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నగర అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీని 8 జోన్ల నుంచి 10 జోన్లుగా పునర్వ్యవస్థీకరించి, ప్రతి జోనల్ స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తూ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది కాలంలో ప్రాజెక్ట్ సారథి, ఆపరేషన్ లంగ్స్, ఈట్ రైట్ క్యాంపెయిన్ ద్వారా షీ టీమ్స్ కార్యక్రమాలతో పాటు నగర అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని వివరించారు. మెగా అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల అమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.1500 కోట్ల నిధుల సాధనకు కృషి చేయడం, అంతర్జాతీయ విమానాశ్రయాలకు అనుసంధాన రహదారుల అభివృద్ధి, 88 కిలో మీటర్ల యాన్యుటి పే అవుట్ మోడల్ రోడ్ల అభివృద్ధి కార్యాచరణ, బ్లూమ్ బర్గ్ మేయర్ ఛాలెంజ్-2025లో అవార్డు సాధించడం వంటి అంశాలు నగర అభివృద్ధిలో ముఖ్యమైన మైలురాళ్లుగా నిలిచాయని తెలిపారు. మహిళల కోసం మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం, మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటు కార్యాచరణ, బీఆర్టీఎస్ రోడ్డులో ఈ-ఆర్టీఎస్ వ్యవస్థ, సైక్లింగ్ ట్రాకులు, హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ల వంటి కార్యక్రమాలు ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధితో పాటు పరిశుభ్రమైన, సౌకర్యవంత మైన నగరంగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, వారి సమష్టి కృషి వల్లే అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు.

# 28 న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి.
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 22:** జిల్లాలో ఈ నెల 28 వ తేదీన నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్ల పై సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 28 న బూత్ల ద్వారా పోలియో చుక్కలు వేయాలని, అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శనల ద్వారా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల 1,89,712 మంది చిన్నారులను లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 1,062 పోలియో బూత్లు, 62 ట్రాన్సిట్ బూత్లు, 94 మొబైల్ బూత్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇంటింటి సర్వే కోసం 2,004 ప్రత్యేక బృందాలు, 4,518 మంది వ్యాక్సినేటర్లు, 120 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించి, విద్యాశాఖ సిబ్బంది సహకారంతో 0-5 ఏళ్ల పిల్లలను గుర్తించి బూత్లకు వచ్చేలా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు బూత్ల నిర్వహణతో పాటు గృహ సందర్శన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమం నిరంతరాయంగా




జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలను పోలియో బూత్ల ఏర్పాటుకు అందుబాటులో ఉంచడంతో పాటు ఉపాధ్యాయులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసర మైన 2,09,653 బీఓపీవీ డోసులు అందుబాటులో ఉంచడంతో పాటు 49 కోల్డ్ చైన్ యూనిట్ల ద్వారా వ్యాక్సిన్ నిల్వ, సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారిని ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా గోడల పై వ్రాతలు, చాటింపులు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బూత్లు ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 25 న చోడవరం లో మెగా జాబ్ మేళా.

- జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్.




**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా జూన్ 25 న (గురువారం) ఉదయం 9-00 గంటలకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, చోడవరం, అనకాపల్లి జిల్లా నందు సుమారు 15 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాకు సుమారుగా 15 బహుళ జాతీయ కంపెనీలు 1,500 ఖాళీలతో హాజరవుతున్నాయని, ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను ఝఅజూబఅఝఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెజ్యూమ్ లు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9-00 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరు. మరిన్ని వివరములకు 9494791935 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి పి.రోహిణి, ఎంప్లాయ్మెంట్ అధికారిని మనోహరిని ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిది అందరికీ ఉపయోగపడాలి పంచకర్ల



**పెందుర్తి, పెన్ సత్తా, జూన్ 22:**సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. సోమవారం ఉదయం పెందుర్తి నియోజకవర్గం పరిధి లోని, సుజాతనగర్ క్యాంప్ కార్యాలయంలో ఆరుగురు లబ్ధిదారులకు 6 లక్షల 61 వేల 923 రూపాయల విలువగల చెక్కులను పంచకర్ల రమేష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఏ ఒక్క పేద కుటుంబం వైద్యం కోసం అప్పులు చేసి ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని పగడ్బందీగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అర్హులందరికీ కేవలం వారం రోజుల్లోనే నిధులు మంజూరు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని వెల్లడించారు. తనకు వ్యక్తిగతంగా ఎంతో సంతృప్తినిచ్చే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఎవ్వరికి ఎలాంటి కష్టం వచ్చినా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ పథకం గురించి తెలియని వారు ఎవరైనా ఉంటే వారికి కూడా వివరించి వారు లబ్ధి పొందేలా సహాయపడాలని ఎన్డీఏ కూటమి నాయకులు, మీడియా ప్రతినిధులకు ఎమ్మెల్యే రమేష్ బాబు సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో సబ్బవరం మండలం అధ్యక్షులు కర్రి కనకరాజు, పెందుర్తి ఏఎంసి వైస్ చైర్మన్ గోరపిల్లి సోమనాయుడు, మాజీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాల, ఏఎంసీ డైరెక్టర్ ఆర్ఎస్ నాయుడు, సీనియర్ నాయకులు గండ్రెడ్డి నగేష్, శ్రీనివాస్ రాజు, దాట్ల మధు, రోమాల చంద్రశేఖర్, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, రాపర్తి కిషోర్, సబ్బవరపు రమణ, పల్లా రమణ, తనకాల శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# 24 న విభిన్న ప్రతిభావంతులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ.

- ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన అర్హులైన లబ్ధిదారులు.
- జూన్ 24 న ధృవపత్రాల పరిశీలనకు హాజరు కావాలి.
- విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ పి.చంద్రిక.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:**విభిన్న ప్రతిభావంతులకు (శారీరక వికలాంగులకు) ఉచితంగా మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనాల పంపిణీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన కార్యక్రమం ఈ నెల 24 వ తేదీన నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ పి. చంద్రిక తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లోని అర్హులైన లబ్ధిదారులకు మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనాలు అందించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన జూన్ 24, 2026 ఉదయం 9:30 గంటలకు జీవీఎంసీ శంకరన్ మీటింగ్ హాల్, అనకాపల్లిలో నిర్వహించ బడుతుందని తెలిపారు. అలాగే, ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9:00 గంటలకే సంబంధిత అన్ని ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఆధార్ కార్డు, వికలాంగ సదరం ధృవీకరణ పత్రం, లేటెస్ట్ ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్సీ-ఎస్టీ ధృవీకరణ పత్రం, రెండు వైకల్యం కనిపించు ఫోటోలు, పదవ తరగతి -అన్ని రకాల విద్యార్హత పత్రాలు, ఎండిఓ, మున్సిపల్ కమిషనర్ నుంచి స్వయం ఉపాధిని ధ్రువీకరించు పత్రం, అభ్యర్థి పై ఎటువంటి కేసులు లేనట్లు వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం, మూడు చక్రముల మోటార్ వాహనము గతంలో ప్రభుత్వము, ప్రభుత్వేతర సంస్థల నుంచి పొందలేదని, రెండు, మూడు, నాలుగు చక్రముల వాహనం సొంతంగా కలిగి ఉండలేదని వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం తదితర అవసర మైన పత్రాలను వెంట తీసుకురావాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కార్యక్రమానికి హాజరై ధృవపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని జిల్లా మేనేజర్ పి. చంద్రిక విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్: 7989589722 కి సంప్రదించాలని కోరారు.

## 23 న వి.ఎం.ఆర్.డి.ఏ జోనల్ కార్యాలయంలో ప్రజా దర్బార్.

- వి ఎమ్ ఆర్ డి ఎ చైర్మన్ ఎమ్.వి.ప్రణవ్ గోపాల్.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:** వి ఎమ్ ఆర్ డి ఎ కి సంబంధించి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 23 న (మంగళవారం) అనకాపల్లి వి ఎమ్ ఆర్ డి ఎ జోనల్ కార్యాలయంలో నిర్వహించటం జరుగుతోందని వి ఎమ్ ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన వెంటనే సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఇప్పటివరకు దిగ్విజయంగా వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతోందన్నారు. అయితే మొట్ట మొదటిసారిగా విశాఖపట్నం వెలుపల అనకాపల్లి జిల్లా రావుగోపాలరావు కళాక్షేత్రంలో ఉన్న వి.ఎం.ఆర్.డి.ఏ జోనల్ ఆఫీసులో స్వయంగా పాల్గొని ప్రజల నుంచి కేవలం వి.ఎం.ఆర్.డి.ఏ కి సంబంధించిన సమస్యల పై అర్జీలను స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. కావున అనకాపల్లి సమీప ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎమ్ వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం.

- క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి.
- వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్.








**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 22:**విశాఖ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విశాఖ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్--2026 పోటీలు ఘనంగా ముగిశాయి.

ఈ కార్యక్రమానికి వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రోత్సాహం అందించాలని సూచించారు.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని, యువత క్రీడలను జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి వి.ఎం.ఆర్.డి.ఎ ప్రత్యేక నిధులు కేటాయించి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎం.వి. ప్రణవ్ గోపాల్ అవార్డులు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభావంతు లైన క్రీడాకారులకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పీలా శ్రీనివాస్, బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉష శ్రీ, పల్లా శ్రీనివాస్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా ప్రముఖులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ.....

**కుత్బుల్లాపూర్ పెన్ సత్తా, జూన్ 22**కుత్బుల్లాపూర్ నియోజకవర్గశీ సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీ ప్రెసిడెంట్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశైలం యాదవ్, ఎరుకల రాజు, జిం వేణు, గజానంద్, పృథ్వి, బబన్, విక్కీ రెడ్డి, జోషఫ్, కిరణ్, అనుదీప్ తదితరులు హాజరయ్యారు. వారు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డితో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# మేకలు కమేల ఏర్పాటు చేయాలని వినతి.

**మేకలు పెట్టుకోవడానికి మూడు ఎకరాల స్థలం కేటాయించాలి.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 22:**టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ని సీతంపేట వారి ఇంటి వద్ద విశాఖ జిల్లా నూరు బాస సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు కలవడం జరిగింది. సోమవారం ఈ సందర్భంగా

సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్.రహిమాన్ నూరు బాషా సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్. బురాన్ ఇరువురు మాట్లాడుతూ అనేక దశాబ్దాల నుండి గ్రేటర్ విశాఖ నగరంలో మాంస విక్రయాలు చేస్తూ బ్రతుకు జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ఆసీల్ మెట్ట జంక్షన్ లో మేకలు కమేల ఉండేదని, పెరిగిన నగరాన్ని దృష్టిలో పెట్టుకొని ఆనాడు హనుమంతువాక జంక్షన్ వద్ద కమేల కమేల ఏర్పాటు చేసి అక్కడకి పంపించారు. నగరంలో చిన్న వాల్తే ర్, పెద్ద వాల్తేర్, ఎంఎపి కాలనీ, వన్ టౌన్ ఏరియా, గోపాలపట్నం, పెందుర్తి ఏరియాల్లో నివాసం వ్యాపారం చేసుకునే వారికి కొంత వెసులు బాటుగా ఉండేదని, వ్యాపారం సాగించేవారన్నారు.

తరువాత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా ఇక్కడ నుండి మేకల కమేల తీసేయాలని చెప్పి జీవీఎంసీ అధికారులు మీరంతా కూడా మారిక వలసలో ఉన్న గోడ్డిల కమేల వెళ్లాలని అన్నారన్నారు. అప్పుడు ఆందోళన చేస్తే స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చొరవతో అప్పుడున్న జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి ఒక సంవత్సరం అదే ప్రాంతంలో మేకలు కోసుకొని విధంగా అవకాశం ఇప్పించారన్నారు.

తరువాత క్రమేపీన మీకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని అప్పుడున్న కమిషనర్ చెప్పి మీరందరూ మారికి వలస ఉన్న గోడ్డిల కమేల వెళ్ళమని చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికీ సుమారు 9 సంవత్సరాలు అవుతుందని, ఈ మధ్యకాలంలో



అర్ధరాత్రి రెండు గంటలకు సమయంలో కమేలకి వెళ్ళేటప్పుడు దారి మధ్యలో కొంతమంది ప్రమాదాలు గురై 10 మంది దాకా చనిపోయి, కొంతమంది క్షతగాత్రులు అవ్వడం జరిగిందన్నారు. నూతనంగా కమేల ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక కొండకానుకుని మేకల కమేల ఏర్పాటు చేసి, అక్కడే మేకలు పెట్టు కొనుటకు మూడు ఎకరాలు స్థలం కేటాయించాలని గత అనేక సార్లు నగరం మేయర్ కి, కలెక్టర్ కి, జీవీఎంసీ కమిషనర్ కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. నేటి వరకు ఆ సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన వెంటనే స్పందించి అక్కడున్న పీఏతో మాట్లాడి కలెక్టర్ కి లెటర్ తయారుచేసి పంపించమనీ చెప్పినారన్నారు. మీ సమస్య పరిష్కారం అయ్యేటట్టు చూస్తానని హామీ ఇచ్చినారు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో షేక్. రహమాన్, షేక్.నవాబ్ ఖాన్, షేక్.సలీం, షేక్.మదీనా, షేక్.యాసిన్, షేక్.వీర్రాజు, షేక్ మదీనా లు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పాఠశాలల్లో పునాది విద్య భేష్.

**ఏపీ విద్యా విధానాలను ప్రశంసించిన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం.**








**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 22:** విశాఖ లోని మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను సందర్శించిన ప్రపంచ బ్యాంక్ సౌత్ ఆసియా వైస్ ప్రెసిడెంట్ జాన్ రూమ్ జుట్. సోమవారం మోడల్ ఫౌండేషన్ స్కూల్స్, సమగ్ర ఈసిసిఈ-ఎఫ్ఎల్ఎన్ విధానాలు, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, 'జాదూయి పిటారా' వంటి బోధనా పరికరాలద్వారా ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తున్న తీరు బాగుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కొనియాడింది. సోమవారం విశాఖపట్నం లోని వార్డు-62, జోన్-4 పరిధి లోని త్రినాథపురం (దుర్గానగర్) జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ప్రపంచ బ్యాంక్ సౌత్ ఆసియా వైస్ ప్రెసిడెంట్ జాన్ రూమ్ జుట్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సాల్ట్' (సాల్ట్ - సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్) కార్యక్రమంలో భాగంగా, మోడల్ ఫౌండేషన్ స్కూల్ సాధించిన ప్రగతిని, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అభ్యాసాల అమలును ఆయన స్వయంగా పరిశీలించారు.

ఇందులో భాగంగా మోడల్ ఫౌండేషన్ స్కూల్ ప్రయాణం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపట్టిన చర్యల పై పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి, ప్రథమ్ ప్రతినిధి కె. సురేష్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్రతినిధులు మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో ప్రపంచ బ్యాంక్ బృందం ముచ్చటించి, అక్కడ పిల్లలకు నిర్వహిస్తున్న ఆహ్వాన కార్యక్రమాలు, బాలల స్నేహపూర్వక అభ్యాస పద్ధతులను పరిశీలించారు. పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే 'ఫోర్ కార్నర్స్ లెర్నింగ్ స్పేస్' (ఆటల ద్వారా నేర్చుకునే స్థలం)ను సందర్శించి, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) 2020, నిపుణ్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన 'జాదూయి పిటారా' ఆధారిత ఎఫ్ఎల్ఎన్ యాక్టివిటీలను, స్కూల్ రెడీనెస్ రోల్-ప్లేలను ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఐసీడీఎస్, పాఠశాల విద్యాశాఖ మధ్య ఉన్న అద్భుతమైన సమన్వయాన్ని, అంగన్‌వాడీ నుండి ప్రాథమిక పాఠశాల వరకు పిల్లల నిరంతర అభ్యాస ప్రక్రియను ప్రత్యేకంగా అభినందిస్తూ విద్యార్థుల లెర్నింగ్ పోర్ట్‌ఫోలియోలను సమీక్షించారు. పాఠశాలలో చేరిన తర్వాత తమ పిల్లల చదువు, ప్రవర్తన, ఆత్మవిశ్వాసంలో వచ్చిన సానుకూల మార్పులను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో పంచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్ బృందం ప్రశంసలు: ప్రతి బిడ్డ జీవితాంతం నేర్చుకోవడానికి అవసర మైన బలమైన పునాది నైపుణ్యాలను అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చూపుతున్న నిబద్ధతను ప్రశంసించింది. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల నాయకత్వం, సమాజం, ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా కలిసి పిల్లల కోసం ఒక గొప్ప అభ్యాస వాతావరణాన్ని సృష్టించడాన్ని ప్రపంచ బ్యాంక్ బృందం అభినందించింది. చివరగా, పాఠశాల సెల్ఫీ స్టాండ్ వద్ద చిత్రాలను దిగారు.

కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు, సాల్ట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి. సతీష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్ రావు, ఏఎంఓ జి.లక్ష్మి, సీడీపీఓ నీలిమ, మండల విద్యాశాఖాధికారులు త్రినాథరావు, వెంకటరావు, ఐసీడీఎస్ అధికారులు, పాఠశాల విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, 'ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' ప్రతినిధులు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష సమావేశం.

**సింహాచలం, పెన్ సత్తా, జూన్ 22:**రానున్న గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని పురస్కరించు కొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు అధికారులను ఆదేశించారు.

సోమవారం దేవస్థానం పరిపాలనా భవనంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో గిరి ప్రదక్షిణ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, వివిధ విభాగాల బాధ్యతలు, భక్తుల సౌకర్యాలు, భద్రతా చర్యలు, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, రవాణా తదితర అంశాలపై కార్యనిర్వహణాధికారి సమగ్రంగా చర్చించారు. ప్రతి విభాగానికి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ మధులత, డీఈఓ సింగం రాధ, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, సహాయ కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులు, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణకు సంబంధించిన విధులు, బాధ్యతల పై వారికి దిశానిర్దేశం చేశారు.



# రాష్టంలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి జగన్ ఓర్చుకోలేక పోతున్నాడు.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:** జనసేన పార్టీ నాయకులు, మాజీ మంత్రి, అనకాపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాలతో స్థానిక అనకాపల్లి జనసేన పార్టీ నియోజకవర్గం కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. నిన్న రామచంద్రపురం వేదికగా వైసీపీ నేతలు నిర్వహించిన సమావేశం, అదే విధంగా కృష్ణ లంక లో సాయి కృష్ణ ఉదాంతం అంశం పై ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసీపీ నాయకుడు జగన్, ఆయన నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్టంలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి ఓర్చుకోలేక ఎదో ఒక విధంగా కుల కుంపటి రగల్చాలి అని ప్రతి నిత్యం ప్రయత్నం చేస్తూనే ఉన్నారు అన్నారు. వైసీపీ నేత జగన్ రాష్ట్రములో తన నాయకత్వాన్ని కులాలు వర్గాలు వారీగా విభజించి ఏ కులం నేతకు ఆ కులం నేతల తోనే వ్యక్తిత్వ హననం చేసుకునేలా చేయించడం అలవాటుగా మారిపోయింది అని అన్నారు. ఆ విధానాన్ని గత 5 ఏళ్ళు పాటించండి మూలనే ప్రజలు వైసీపీ కి కనీసం ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వలేదు అని, అయినా ఆయనకి బుద్ధి మారలేదు అన్నారు. వైసీపీ నాయకుడు క్రిమినల్స్ కి కూడా కులం ఆపాధించి రాజకీయం చేస్తే ఇంక రాష్ట్రములో ఎవరు ఏ తప్పు చేసిన, వ్యక్తి ఐన ఎదో ఒక సామజికవర్గానికి చెందుతారు అని, అప్పుడు ఎవరికీ శిక్షలు వేయాలి, పోలీసులు ఎవరి పై చర్యలు తీసుకోవాలి అని అన్నారు. దేశం లో క్రిమినల్స్ ని వైసీపీ తప్ప ఇతర ఏ నాయకుడు ఈ కోణంలో చూడరు అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో కాపు సామజిక వర్గానికి, యువత కు తీరని మోసం చేసి, వారి సామజిక వర్గాల భవనాలకు కేటాయించిన స్థలాలను కబ్జా చేసి విలాసవంత మైన కార్యాలయాలు కట్టినప్పుడు, విదేశీ విద్య నిధులను దూరం చేసి నప్పుడు కాపుల సంక్షేమం గుర్తు రాలేదా అన్నారు. గత 5 ఏళ్లలో సాధారణ ఫెంక్షన్, అమ్మవడి ఇతర పథకాలు నిధులను కూడా సామజిక వర్గాల వారీగా విభజించడం వైసీపీ నేతలకు మాత్రమే చెల్లుతుంది అన్నారు. నిన్న రామచంద్రపురం వేదికగా నిర్వహించిన వైసీపీ కాపు నేతల సమావేశంలో పాల్గొన్న వ్యక్తులు అందరు ఇదే విధానం వారి పదవి కాలంలో ఆవలంభించడం మూలానే గోరమైన ఓటమి చెందారు అని అన్నారు. అయిన వారికీ బుద్ధి రాలేదు అని అన్నారు. పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అని, ఆయనకి ఎదో ఒక విధంగా కులం రంగు పులమాలని చూస్తే ఊరుకోము అని, అన్నీ సామజిక వర్గాలు అయన తో ఉన్నాయి అని అన్నారు. ఇదే విధానం వైసీపీ నేతలు పాటిస్తే ఊరుకునే పరిస్థితులు లేవు అని అన్నారు. ఈ సమావేశం లో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం అధికార ప్రతినిధి దూలం గోపి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి కృష్ణ, హేమ గిరి సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్, మాజీ ఎంపీటీసీ చదరం నాగేశ్వరావు, జనసేన నేత గంగుపాం జగదీశ్, చంద్రావతి, లక్ష్మి నారాయణ, దాడి బుజ్జి ( జగన్నాధ స్వామి దేవస్థానం చైర్మన్ ), సేనాపతి రవి తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జి లను తనిఖీ చేసిన పోలీసు అధికారులు.







**పరవాడ, పెన్ సత్తా, జూన్ 22:** అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి లోని అన్ని లాడ్జిలను పోలీసు అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాడ్జిలలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, అతిథుల నమోదు రికార్డులు, పోలీసు శాఖ సూచించిన స్టే యాప్ వినియోగం, సందర్శకుల వివరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

తనిఖీలలో కొన్ని లాడ్జిలలో సీసీ టీవీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం గుర్తించబడింది. అలాగే నిఘా పరిధిలో లేని వ్యూహాత్మక ప్రాంతాలలో అదనపు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించి, సంబంధిత యాజమాన్యాలకు తక్షణమే అవసర మైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లాడ్జీల యజమానులు, నిర్వాహకులకు సీసీటీవీ కెమెరాలు 24ఐ7 నిరంతరం పనిచేసేలా చూడాలని, రికార్డింగ్‌ను నిర్దేశిత కాలం వరకు భద్రపరచాలని, అతిథుల పూర్తి వివరాలను ఎప్పటి కప్పుడు నమోదు చేయాలని, ప్రతి సందర్శకుడి గుర్తింపు పత్రాన్ని తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆదేశించారు.

ప్రజల భద్రత, శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా లాడ్జీలలో నిబంధనల ప్రకారం రికార్డుల నిర్వహణ, స్టే యాప్ వినియోగం, సమర్థవంత మైన నిఘా వ్యవస్థల నిర్వహణ అత్యంత ముఖ్యమని వివరించారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# నూకాంబికకు ఆభరణాలు బహూకరణ





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 22:** గవరపాలెం వెలసిన నూకాంబిక అమ్మవారికి దేవస్థానంలో సోమవారం విశాఖపట్నం వాస్తవ్యులు సూర్య ట్రావెల్స్ అధినేత శెట్టిపల్లి సుబ్బారావు చైతన్య స్రవంతి దంపతులు నూకాంబిక అమ్మవారికి ఎర్ర పొడులుతో కూడిన నామం, బొట్టు సుమారుగా 73 గ్రాముల బంగారం ఆభరణాలు దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్ నారాయణరెడ్డి..

**రంగారెడ్డి జిల్లా, పెన్ సత్తా, జూన్ 22:** ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజావాణిలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 105 దరఖాస్తులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 36, ఇతర శాఖలకు సంబంధించినవి 69 ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి అనంతరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి అండగా నిలుస్తాం.

- రూ.18.5 లక్షలతో సౌచాలయాల ఏర్పాటు.
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్.



**గుంటూరు, పెన్ సత్తా, జూన్ 22:** కేంద్రీయ విద్యాలయంను ఆధునీకరించటానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. సెంట్రల్ ట్యాక్స్ శాఖ స్వచ్ఛతా నిధులతో నల్లపాడు కేంద్రీయ విద్యాలయంలో సరికొత్త హంగులతో, అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన సౌచాలయాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా విద్యాలయంలో శిధిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు ను రూ. 18.5 లక్షల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో పూర్తి స్థాయిలో పునరుద్దరించామన్నారు. ఈ ప్రాజెక్టు లో భాగంగా పాఠశాలలో మూడు అంతస్తుల లోని ఆరు బ్లాకులలో బాలురు, బాలికల కోసం అత్యాధునిక ప్రీమియం నాణ్యతతో నిర్మించడం జరిగిందన్నారు. అందరికీ సమాన హక్కు కల్పించే లక్ష్యంతో, దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేక సౌచాలయం నిర్మాణానికి ఈ ప్రాజెక్ట్ లో ప్రాధాన్యత ఇవ్వబడిందన్నారు. ఆధునిక పారిశుధ్య సౌకర్యాల వల్ల పాఠశాలలో పరిశుభ్రత, మౌలిక వసతులు మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యాలయాలలో మౌలిక సౌకర్యాలను మెరుగు పరచడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత గా భావించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ప్రిన్సిపాల్ బొంత శేఖర్ మాట్లాడుతూ స్వచ్ఛత నిధులతో తమ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత కమిషనర్ కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు, ఎన్.సి.సి క్యాడెట్లు, స్కౌట్ అండ్ గైడ్స్ ఘన స్వాగతం పలికారు.

# చేపల సామూహిక మృతి పై కారణాలను

నిర్ధారించేందుకు నమూనాల సేకరణ






**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 22** మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జాతీయ జలచర జంతు వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమం (ఎన్ఎస్పిఎఎడి) కింద నక్కపల్లి మండలం లోని బోయపాడు గ్రామంలో చేపల సామూహిక మరణాలు సంభవించిన నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టబడింది. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (షిఫ్ట్), కాకినాడ ప్రిన్సిపల్, అదనపు సంచాలకుల ఆదేశాల మేరకు, జిల్లా మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో ఎన్ఎస్పిఎఎడి బృందం సంఘటన స్థలాన్ని సందర్శించి చేపల మరణాలకు గల కారణాలను నిర్ధారించేందుకు మృత చేపల నమూనాలు నీటి నమూనాలను సేకరించింది. సేకరించిన నమూనాలను విశ్లేషణ నిమిత్తం స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (షిఫ్ట్), కాకినాడ ప్రయోగశాలకు పంపించారు.

అదనంగా, జాతీయ జలచర జంతు వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమం (ఎన్ఎస్పిఎఎడి)లో భాగంగా అనకాపల్లి జిల్లాలోని బంగారమ్మపేట, పెంటకోట ప్రాంతాలలో ఉన్న వివిధ రొయ్యల చెరువుల నుండి నమూనాలను సేకరించి, ఈహెచ్పి మరియు డబ్ల్యుఎస్ఎస్వి (వైట్ స్పాట్ సిండ్రోమ్ వైరస్) వ్యాధుల నిర్ధారణ కోసం ప్రయోగశాల పరీక్షలకు పంపించారు.

జలచర జంతువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, వ్యాధుల ప్రబలతను ముందస్తుగా గుర్తించడం, వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన చర్యలను సూచించడం, రైతులకు సకాలంలో సాంకేతిక మార్గదర్శకాలు అందించడం, స్థిరమైన ఆక్వాకల్చర్ అభివృద్ధికి తోడ్పడడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది

పి. కిరణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, ఎన్. ఎన్. చైతన్య, యంగ్ ప్రొఫెషనల్–××, పి. శ్రీనివాస్, జూనియర్ కన్సల్టెంట్ (జేసీ), శివాజీ, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ (విఎఫ్ఎ), జె. పూర్ణిమ, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ (విఎఫ్ఎ), డి.ఎల్. పురం, కె. త్రినాధ్ బాబు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ (విఎఫ్ఎ), పెంటకోట పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పై కదంతొక్కిన ఆర్ఎస్ఎఫ్...

- కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ ఫీజుల తో దోపిడీని ఆపాలి...
- తల్లికి వందనం నిధులను వెంటనే విడుదల చేయాలి...
- పెండింగ్ లో వున్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి...
- ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ మెస్ చార్జలను పెంచాలి..
- పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలి..
- కడప కలెక్టరేట్ వద్ద భారీగా ఆందోళనలు...
- మహావీర్ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ...
- రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్
- (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్




**కడప, పెన్ సత్తా, జూన్ 22:** ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేయారు. సోమవారం కడప కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో భారీగా ఆర్ఎస్ఎఫ్ ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు మహావీర్ సర్కిల్ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ సంవత్సరాల నుండి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండుల నుండి ఒకటే డిమాండ్ ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ తగ్గించాలని, కానీ యేటా స్కూల్ ఫీజులు పెంచుతూజునే వున్నారన్నారు. నారాయణ, చైతన్య, భాష్యం శ్రీధర్ రెడ్డి, జీవన్ జ్యోతి, ఎడిఫై, విద్యా సంస్థల దోపిడీ లో ముందున్నయ్యన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంపాదనలో 70% పిల్లల చదువులకే ఖర్చు పెడుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి లక్ష రూ. ఫీజు కట్టాల్సి వస్తుందన్నారు. కలెక్టర్ జిల్లా లోని కార్పొరేట్, ప్రయివేట్ స్కూల పైన చర్యలు తీసుకోవాలి, అవినీతి డిఈఓ షంసుద్దీన్ పై చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ తదితర విద్యార్థులకు 7 వేల కోట్ల రు. ఫీజు బకాయిలు పెండింగ్లో వున్నాయి, వెంటనే చెల్లించాలని ఆర్ఎస్ఎఫ్ డిమాండ్స్ చేస్తుందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు హాస్టల్స్ లల్లో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు, హాస్టల్ మైంటెనెన్సు చార్జెస్, మెస్ చెస్ చార్జెస్ ను పెంచి, సమయానికి ఇవ్వాలి, అదే విదంగా పేద మధ్యతరగతి విద్యార్థులు ఏంబిఏ, ఏంసిఏ, ఏం ఫార్మసీ లాంటి పీజీ కోర్సులు చదవాలి అంటే ఫీజులు ప్రభుత్వం నుండి రాకుండా వున్నా జిఓ నెంబర్ 77 ను రద్దు చేయాలి. ప్రభుత్వం పాఠశాలలకి, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి, అధ్యాపక పోస్టులను భర్తి చేయని డిమాండ్స్ చేశారు. దీని పైన ప్రభుత్వం స్పందించ కుంటే రాష్ట్రం వ్యాప్తంగా విద్యారలతో తొందర్లో చలో విజయవాడ పిలుపునిచ్చి సెక్రటరియేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.వంశీ పి.రెడ్డి సాయి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కేశవ,యోగి వేమన యూనివర్సిటీ పరి రక్షణ కమిటీ కన్వీనర్ అమృత్ కుమార్, రాష్ట్ర నాయకులు చిరంజీవి, నగర అధ్యక్షులు సాత్విక్, డాక్టర్ సుమన్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దుగ్గిరాలలో ఘనంగా కూటమి 2 సంవత్సరాల విజయోత్సవ సభ







**దెందులూరు, పెన్ సత్తా, జూన్ 22:**
కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా దెందులూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పాలనను వివరిస్తూ సోమవారం సాయంత్రం దుగ్గిరాలలో రెండేళ్ల విజయోత్సవ సభ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. 2 ఏళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పాలనను అభినందిస్తూ ప్రసంగించిన టీడీపీ జనసేన బిజెపి నాయకులు వందలాదిగా తరలి వచ్చిన కూటమి నాయకులు.

కార్యక్రమంలో ముందుగా మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంటే విశ్వసనీయతకు నిదర్శనంగా ప్రజల గుండెల్లో స్థానం నిలబెట్టుకుందని, ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇచ్చామని, గొడ్డలి పార్టీ దగా ప్రభుత్వం లాగా ఫించన్లు పెంచుతామని చెప్పి అధికారం లోకి వచ్చి, ఆ తర్వాతా పెంచుకుంటా పోతాం అంటూ జనాల్ని 5 వేళ్లు నుంచి చేతి బారు అంతా నాకించిన మోసగాడు జగన్ అని, అలాంటి మోసగాళ్లను, ఆ పార్టీ నాయకులు నమ్మే పరిస్థితిలో ఇక ఎన్నటికీ జనం ఉండరు అని తెలిపారు. ఒక్క చాన్స్ అంటే నమ్మి అవకామ ఇచ్చిన జనాల్ని నిండా ముంచి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, అక్రమాలకు, అరాచకాలకు కేరాఫ్ గా పాలన చేసిన గొడ్డలి పార్టీ కి కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదంటూ జనం కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా చీదరించుకున్నారని, అయినా కూడా ఇంకా బుద్ధి లేకుండా విష ప్రచారాలు, కుల రాజకీయాలు, శవ రాజీయాలు చేయాలని చూస్తున్నారు అని అలాంటి వారికి త్వరలో జనం శాశ్వతంగా రాజకీయ సమాధి కడతారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు బిజెపి, జనసేన నాయకులార వైసీపీ ట్రాప్ లో పడకండి, వాళ్లతో కుమ్మక్కు అయ్యి తప్పుడు పనులు చేసే మన పార్టీలో ఉన్న కో వర్టులతో అప్రమత్తంగా ఉండండి అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. అదే విధంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి నాయకులారా, జనసైనికులారా మీరు వైసీపీ వాళ్ళ ట్రాప్ లో పడకండి, మనకూటమిలో ఉండి కూడా మన నియోజకవర్గంలో సంబంధించి విషయాల్ని అవినీతి జరిగిందని అక్రమాలు జరిగాయని, ఎవరో దోపిడీ చేశారు అని కొందరు మాట్లాడుతున్నారూ మనకి మన ఫ్లాట్ ఫామ్ ఉంది. మనకి మాట్లాడుకునే రైట్ ఉంది. ఏ ఒక్క వెంట్రుక వాసి తప్పు జరిగింది దెందులూరు లోనే అని మీరు మనస్ఫూర్తిగా చెప్పిన మరుక్షణమే నేను రాజీనామా చేసి ఇంటికి వెళ్ళిపోతాను, మీరు మనస్ఫూర్తిగా తప్పు జరిగిందని మీరు నమ్మితే నేను సిద్ధం అన్నారు. అంతే తప్ప కొందరు చెప్పే మాటలన్నీ వేరే పార్టీ వాళ్ళతో రహస్యంగా బయటికి వెళ్లి చేసే అర్ధరాత్రిలు ఏ విధంగా మనల్ని రోడ్డు మీదకు తీసుకురావాలి అనే కుట్రలో భాగంగా ఇవన్నీ జరుగుతున్నాయి అన్నారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉండి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.120 కోట్ల రూపాయలు దెందులూరులో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రోడ్లు తీసుకొచ్చారు. రూ.120 కోట్లు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం పెట్టాం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాంఅన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరితో సమన్వయం చేసుకుంటూ దెందులూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అహర్నిశలు కృషి చేస్తున్నానని ఎప్పటికీ చేస్తానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ 2014 నుంచి 19 వరకు రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తూ కేంద్ర సహకారంతో ఇటుక ఇటుక పేరుస్తూ అమరావతి నిర్మాణం చేస్తూ ఉండగా, దూరదర్శన్ శాతం 2019 లో అధికారం లోకి వచ్చిన వైసిపి రాష్ట్రంలో దాష్టికాలకు దుర్మార్గాలకు పాల్పడిందని అన్నారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలకు 12 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించామని చెప్తున్నా వైసిపి, బటన్ నొక్కి ప్రజలకు వేసింది కేవలం తొమ్మిది లక్షల కోట్లు మాత్రమే అని, మిగతా మూడు లక్షల కోట్ల రూపాయలు వాళ్ళ అక్రమాలకు వాళ్ళ అవినీతికి పక్కదారి మళ్లించారని అన్నారు. పోలవరాన్ని వైసీపీ ప్రభుత్వంలో ఆటకెక్కించిన పరిస్థితి నుంచి ఈనాడు 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగుతున్నాయని తెలిపారు. అమరావతిలో జరుగుతున్న నిర్మాణాలను ప్రతి ఒక్క రాష్ట్ర పౌరుడు పరిశీలించాలని తెలిపారు. జనసేన నాయకులు మేడికొండ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో పంచాయతీలు కనీసం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు కూడా చేయలేని అగమ్యగోచర పరిస్థితులకు చేరుకుంటే, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో పంచాయతీలను తిరిగి బలోపేతం చేస్తూ గ్రామాలను అభివృద్ధి దిశలో పయనింప చేస్తున్నారని తెలిపారు. అటవీ శాఖలో ఉన్న లోపాలను సరి చేస్తూ పర్యావరణాన్ని రక్షిస్తూ అటవీ పర్యావరణ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ ఎనలేని సేవలు అందిస్తున్నారని, 25 కోట్ల సీడ్ బాల్ క్యాంపెయిన్ ద్వారా రాష్ట్రంలో పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో కులాల మధ్య చిచ్చుపెట్టారని ఎప్పటికీ కూడా కుల రాజకీయాలు పెట్టాలని చూస్తున్నారని, లా అండ్ ఆర్డర్ అంశంలో పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల తెలియజేసారని అన్నారు. దెందులూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు అంకెం. ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో రైతు భరోసా పేరుతో రాష్ట్ర వాటా కింద కేవలం 7,500 మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం ఈనాడు పిఎం కిసాన్ తో కలిపి ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు అందిస్తూ రైతులు అండగా నిలిచిందని అన్నారు. జగన్ రైతుల ద్రోహి అని కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తెలిపారు. ఇప్పటికే పింఛన్ల కోసం రాష్ట్రంలో దాదాపు 65 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి చిత్తశుద్ధితో పోవడం ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఐటి విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఆయా శాఖలో సమూల మార్పులు తెచ్చారని ఈనాడు ప్రభుత్వ విద్యాలయాల్లో చేరడం అంటే ఎంతో గర్వకారణంగా భావిస్తున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ కష్టపడుతూ పనిచేస్తున్న ఎమ్మెల్యే దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, నియోజవర్గ టీడీపీ పరిశీలకులు ఇందిరా ప్రియదర్శిని, జనసేన నాయకులు మేడికొండ కృష్ణ, మోటే పల్లి పవన్, కల్కి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బిజెపి సీనియర్ నాయకులు కట్నేని కృష్ణ ప్రసాద్, దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గారపాటి రామసీత, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, ఎమ్మార్వోలు బత్తిన సుమతి, కృష్ణ జ్యోతి, ఎంపీడీవోలు ప్రతాప్, నాగేంద్ర ప్రసాద్ సహా పలువురు టిడిపి, బిజెపి, జనసేన, దెందులూరు నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డు తొలగించాలని ప్రజాభవన్ లో నేడు వినతిపత్రాన్ని సమర్పించనున్న పోరాటకమిటి

- జూలై-01 నుండి 20 వరకు పాదయాత్రాలు, మండలాల వారిగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చేసిన తీర్మానాలు.




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా, జూన్ 22:** జ్యోతిరావు పూలే తెలంగాణ ముఖ్యమంత్రి జ్యోతిరావు పూలే కార్యాలయం లో 2026,జూన్-23, మంగళవారం రోజున జవహర్ నగర్ రాంకి చెత్త డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించడం జరుగుతుందని చైర్మన్ షేక్ షావలి తెలియజేశారు. జూన్-22, సోమవారం రోజు జేఏసీ చైర్మన్, ఇష్టూ షేక్ షావలి అధ్యక్షతన కమిటీ కో-కన్వీనర్స్, సభ్యుల సమావేశం జరిగింది. కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల ప్రజలకు మరియు చుట్టూ ఉన్న శామీర్ పేట, యాప్రాల్, కీసర, చీరాల, సాకేట్, రాంపల్లి, నాగరం, ఘట్ కేసర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు డంపింగ్ యార్డు వలన ఎదురౌతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తించిందని అన్నారు. అందులో బాగంగా మంగళవారం రోజు 23 న ప్రజా భవన్ లో వినతి పత్రం సమర్పణ, ప్రభుత్వంపై మరింత ఒత్తిడిని పెంచెలా ప్రచార కార్యక్రమాల్లో బాగంగా జూలై-1 నుండి జవహర్ డంపింగ్ యార్డు చుట్టూ ఉన్న మండలాల్లో రౌండ్ టేబుల్ శమావేశాలు, జూలై-10 నుండి 20 వరకు జవహర్ నగర్ జీహెచ్ఎంసీ లోని సుమారు 100 బస్తీలలో ప్రజలను చైతన్య పరిచే పాదయాత్రాలు నిర్వహించి, భవిష్యత్ ప్రజా పోరాట కార్యక్రమాల్లో బాగస్వాములను చేయడానికి పూనుకొందని అన్నారు.కమిటిలోని బాగస్వామ్య సంస్థలకు చెందిన నేతల సూచనల మేరకు కొద్ది మార్పు, చేర్పులతో సమావేశంలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని అన్నారు. ఈపై సమావేశంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటి కమిటిలోని మాజీ కార్పొరేట్ ప్రజా ప్రతినిధులు గొడుగు వేణు, సుబ్రమణ్యం, కమిటీ కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, కమిటీ గౌరవ సలహదారులు ఆర్. నర్సింహ్మా గౌడ్, కవి, రచయిత ఎస్.కె.మీరా, కమిటి కో కన్వీనర్స్ బీఎస్పీ బిర్రు యాకస్వామి, సిపిఐ తోటపల్లి శంకర్, టియుసిఐ వీ.ప్రవీణ్, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, సిఎంఎస్ జయక్క, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత మరియు కమిటీ సభ్యులు పిడిఎం జి.చంద్రమౌళి, అరుణోదయ ఇనుప సురేష్, బి.ఎన్.ఆర్.కె.ఎస్.జీహెచ్ఎంసీ సూర వెంకటయ్య, పిఓడబ్ల్యూ జయసుధ, స్వరూప, లక్ష్మీ, భహుజన రక్షణ సమితి (బీఆర్ఎస్) మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ టి.కాలేషా,అబ్బూ,ఆమ్ ఆద్మీపార్టీ మోఇన్, సి.హెచ్.మాదవరెడ్డి, కవి మేడశీను, ఎన్జీవో సేవా సంస్థ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో తక్కువ ఖర్చుతో... అధిక లాభం

ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి



**నర్సింహులపేట పెన్ సత్తా, జూన్ 22:** రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియాను ఉపయోగించి అధిక లాభాలు పొందాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సింహుల పేట మండల కేంద్రంలోని పీ ఎస్ సి ఎస్ ఆధ్వర్యంలో రైతులకు యాప్ ద్వారా జరిగే యూరియా పంపిన విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. అవసరమైన ప్రతి రైతుకు ఏలాంటి ఇబ్బంది లేకుండా యూరియా అందిస్తామని అన్నారు. యూరియా వాడకాన్ని క్రమంగా తగ్గించి నానో యూరియాకు అలవాటు పడాలని, దీంతో రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందన్నారు. ప్రభుత్వం సూచించిన ఆరు రకాల వరి సన్నాలను మాత్రమే రైతాంగం సాగు చేయాలని వాటికి బోనస్ అందించడమే కాకుండా ఎలాంటి ఇబ్బంది లేకుండా విక్రయించుకోవచ్చని సూచించారు. మంగళవారం నుండి రైతు వేదికల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాకయ్య, ఏవో వినయ్ కుమార్, ఏఈఓ మౌనిక, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729

## సంపాదకీయం

# విచ్ఛిన్న నిర్మాణం!

భారత వ్యవసాయ రంగం నేడు నిర్ణాయక సంధి దశలో నిలబడి ఉంది. ఆహార భద్రత సాధించడం, ఆధునిక ఎగుమతి ఆధారిత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ వైపు పరివర్తన చెందడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడం అనే మూడు లక్ష్యాలను ఏకకాలంలో సాధించాలని దేశం తపిస్తున్న వేళ.. వ్యవసాయ నిపుటాల నియంత్రణ వ్యవస్థ మాత్రం అంతకంతకూ సంక్లిష్టంగా, విచ్ఛిన్నంగా మారుతోంది. కేంద్ర చట్టాల పరిధిలో ఇప్పటికే నియంత్రణలో ఉన్న వ్యవసాయ నిపుటాల రంగంలో, అనేక రాష్ట్రాలు తమదైన నిబంధనలు, ఆంక్షలు, పరిపాలనా ఉత్తర్వులు జారీ చేస్తున్నాయి. ఈ పరిణామం పరిశ్రమలో తీవ్రమైన అనిశ్చితిని సృష్టిస్తుండగా, రాష్ట్రాలు వాస్తవంలో కేంద్రాన్ని అధిగమించి వ్యవసాయ నిపుటాల నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుంటున్నాయా? అన్న మూలభూత ప్రశ్న తలెత్తుతున్నది. ఈ సంక్షోభానికి భారత రాజ్యాంగ నిర్మాణమే పునాది. కేంద్రం 1968నాటి పురుగుమందుల చట్టం, 1985 నాటి ఎరువుల నియంత్రణ ఉత్తర్వు, 1966నాటి విత్తనాల చట్టంవంటి కీలకమైన శాసనాలను ఏకరూప జాతీయ నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యంతో రూపొందించింది. అయితే వ్యవసాయం ప్రధానంగా రాష్ట్ర జాబితాలో ఉన్న విషయమవడం వల్ల, ఈ చట్టాల అమలు రాష్ట్రాల నుండి రాష్ట్రాలకు విస్తృతంగా భిన్నంగా ఉంటున్నది. ఒకే కేంద్ర శాసనాన్ని వివిధ పాలనా వ్యవస్థలు వేర్వేరుగా వ్యాఖ్యానించి, అమలు చేస్తున్న ఈ విచ్ఛిన్న వ్యవస్థ రైతులకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తోంది. రాష్ట్రాలకు నిర్దిష్టమైన లైసెన్సింగ్ షరతులు, తనిఖీ కార్యక్రమాలు, పత్రాల సమర్పణ అవసరాలు, నిల్వ నివేదికల నిబంధనలు, ఉత్పత్తి ఆంక్షలు.. ఇవన్నీ రైతు భద్రత, నాణ్యతా హామీ పేరుతో సమర్థించబడుతున్నప్పటికీ, వాస్తవంలో పరిశ్రమకు సమాంతర అనుపాలన నిర్మాణాన్ని సృష్టిస్తున్నాయి. ఇది రైతు హితమా, పరిశ్రమ నిరాశా? అన్న ద్వంద్వ ప్రశ్న ఇప్పుడు ప్రాముఖ్యతాంశం.

వాస్తవం గమనిస్తే.. పురుగుమందులు, ఎరువుల నమూనా పరీక్షలు నాసిరకం ఉత్పత్తుల విక్రయాన్ని నిరోధించడానికి అత్యవసరం. నిజమే, కానీ ఈ ప్రక్రియ సమాన, పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో అమలు కావడం లేదు. మహారాష్ట్రలో 1968 నాటి పురుగుమందుల చట్టంతో పాటుగా 2023 నాటి రాష్ట్ర సవరణ చట్టాన్ని కూడా అమలు చేస్తున్నారు. జిల్లా పరిషత్ స్థాయిలో వ్యవసాయేతర సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇది డీలర్లు, పంపిణీదారుల మధ్య గందరగోళాన్ని సృష్టిస్తూ చట్టబద్ధమైన వ్యాపారంపై ఒత్తిడిని పెంచుతున్నది. పరిశ్రమ వర్గాలు ఈ పరిస్థితిని "ఇన్‌స్పెక్టర్ రాజ్"గా అభివర్ణిస్తున్నాయి. తరచూ జరిగే తనిఖీలు వ్యవసాయ నిపుటాలపై ఆధారపడే రైతులకే కాక, సంస్థలకు కూడా కార్యాచరణ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నాసిరకం పురుగుమందుల విక్రయంపై కారావాసం, జామీనులేని నేరాలు సహా కఠిన శిక్షలు ప్రవేశపెట్టబడ్డాయి. ఉద్దేశం చెడు కాదు, కానీ అమలులో అసమానత తేటతెల్లంగా కనిపిస్తున్నది: చట్టపరమైన నిబంధనలు పాటించే బాధ్యతాయుత సంస్థలే తనిఖీల పరిధిలో ఎక్కువగా ఇరుక్కుంటున్నాయి. అదే సమయంలో రాత్రికి రాత్రి అదృశ్యమయ్యే నకిలీ వ్యాపారులు చట్టం నుండి తప్పించుకుంటున్నారు. పురుగుమందుల చట్టం సెక్షన్ 27 ప్రకారం రాష్ట్రాలు పురుగుమందు అణువులపై గరిష్టంగా 90 రోజుల తాత్కాలిక నిషేధం విధించవచ్చు, 60 రోజులు, మరో 30 రోజులు పొడిగింపుతో. కానీ ఆందోళన కలిగించే విషయమేమిటంటే, కొత్త శాస్త్రీయ ఆధారాలు లేకుండానే ఈ నిషేధాలు పదే పదే పొడిగించబడుతున్నాయి. పారాక్వాట్ 2023లో ఒడిశాలో నిషేధించబడి ఇంకా అమలులో ఉంది. తెలంగాణ కూడా ఇటీవల ఇదే అణువుపై 60 రోజుల నిషేధం విధించింది. పంజాబ్ 11 పురుగుమందులపై 60 రోజుల నిషేధం విధించగా, పంజాబ్-హర్యానా హైకోర్టు మరొక రాష్ట్ర నిషేధాన్ని శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొని నిలిపివేసింది. రాజస్థాన్‌లో జీవనియంత్రకాలపై, హర్యానాలో జీవప్రేరకాల అమలులో.. అన్నిచోట్లా రాష్ట్రాల విభిన్న విధానాలు వ్యవసాయ నిపుటాల రంగంలో తీవ్రమైన అనిశ్చితిని నిర్మిస్తున్నాయి.

ఎరువులు, విత్తనాల రంగంలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు, నిజానికి మరింత ఆందోళనకరంగా ఉంది. 1985నాటి ఎరువుల నియంత్రణ ఉత్తర్వుకు అతీతంగా సూక్ష్మపోషకాలకు స్థానిక నిబంధనలు విధించడం ద్వారా రాష్ట్రాలు అనుపాలన భారాన్ని పెంచుతున్నాయి. నిర్బంధ నిల్వ నివేదికలు, కదలిక ఆంక్షలు ముఖ్యంగా విత్తన కాలంలో ఎరువుల అందుబాటును విఘ్నం కలిగిస్తున్నాయి. విత్తన నియంత్రణలో ప్రత్యేక విక్రయ అనుమతులు, నిర్బంధ స్థానిక పరీక్షలు, అదనపు ఆమోద ప్రక్రియలు కొత్త విత్తన రకాల విడుదలను ఆలస్యం చేస్తున్నాయి. 2024లో పూణేలో రాష్ట్ర వ్యవసాయ శాఖ 149 కోర్టు కేసులు నమోదు చేసింది. 266 డీలర్ లైసెన్సులు నిలిపివేయబడ్డాయి. 485 లైసెన్సులు రద్దయ్యాయి. 1,044 రిటెయిలర్లకు విక్రయ నిలిపివేత ఉత్తర్వులు జారీ అయ్యాయి. 50 పోలీస్ కేసులు నమోదయ్యాయి నకిలీ విత్తనాల సరఫరాకు సంబంధించి. ఉద్దేశం రైతు రక్షణే అయినప్పటికీ, ఇంత విస్తృత అమలు చర్యలు చట్టబద్ధమైన వ్యాపారాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. హర్యానా ప్రభుత్వం కంపెనీల ఎండీలు, డైరెక్టర్లు, సీఈఓలపై చర్యలు ప్రారంభించే ప్రయత్నం చేసింది; కర్ణాటక డైరెక్టర్ నుండి అఫిడవిట్ కోరుతున్నది. మానక కేంద్ర అవసరాలకు అతీతంగా అదనపు పత్రాలు, స్థానిక కార్యాలయ అవసరాలు, సాంకేతిక సిబ్బంది వివరాలు కోరడం.. ఇవన్నీ వ్యాపారాన్ని నిరుత్సాహపరిచే కారకాలుగా మారుతున్నాయి. ఇక్కడ అర్థమయ్యేది ఏమిటంటే భారత వ్యవసాయ నిపుటాల నియంత్రణ పర్యావరణ వ్యవస్థలో నిర్మాణాత్మకత పెరుగుతున్నది. రైతు రక్షణ, చట్టాల అమలులో రాష్ట్రాలు అనివార్యమైన భాగస్వాములే; కానీ అతిగా లేదా అసందర్భంగా జోక్యం చేసుకోవడం అనిశ్చితిని సృష్టిస్తుంది, సరఫరా వ్యవస్థలను దెబ్బతీస్తుంది, అనుపాలన భారాన్ని పెంచుతుంది. అందుకే, కేంద్ర-రాష్ట్ర సమన్వయంలో పాతుకుపోయిన హార్మనైజ్డ్, సైన్స్ ఆధారిత నియంత్రణ చట్రం అత్యవసరం. సహకార సమాఖ్య స్ఫూర్తితో మాత్రమే కేంద్రం రూపకల్పన, రాష్ట్రాలు అమలు అనే సమతుల్య బాధ్యత విభజనతో మాత్రమే భారతదేశం నియంత్రణ వ్యవసాయ సంక్షేమాన్ని బలపరుస్తూనే ఆవిష్కరణ, వ్యాపార సామర్థ్యం, నాణ్యమైన నిపుటాల సకాలిక అందుబాటును నిర్ధారించగలదు. లేదంటే నష్టపోయేది పరిశ్రమ మాత్రమే కాదు -అన్నదాత అయిన రైతే!!

# డ్రోన్ల శకంలో భారత్!


యుద్ధభూమి మారింది. శత్రువు మారాడు. ఆయుధం మారింది. కానీ భారత సంగ్రహణ వ్యవస్థ మారిందా? రెండు బిలియన్ డాలర్ల డ్రోన్ కొనుగోలు ప్రకటన వెలువడిన వేళ, అసలైన ప్రశ్న డ్రోన్లు కొంటున్నామా అన్నది కాదు.. సరైన తీరులో కొంటున్నామా? అన్నది. ఉక్రెయిన్ యుద్ధభూమి నిరూపించింది: చౌకైన డ్రోన్లు, వేగవంతమైన నిర్ణయాలు, నిరంతర పరిణామం.. ఇవే నేటి విజయ సూత్రాలు. కొనుగోలు మాత్రమే సరిపోదు; దీర్ఘకాలిక భాగస్వామ్యం, నిరంతర సామర్థ్యం అవసరం. లేదంటే రెండు బిలియన్ డాలర్లు రెండు మూడేళ్లలో వ్యర్థమవుతాయి.



యుద్ధభూమి స్వరూపం మారిపోతోంది. ఒకప్పుడు యుద్ధమంటే భారీ యుద్ధ విమానాలు, శక్తివంతమైన యుద్ధట్యాంకులు, సుశిక్షిత సైనిక బలగాలు మాత్రమే. కానీ ఇరవై ఒకటో శతాబ్దం రెండో దశాబ్దం నుండి యుద్ధ వ్యూహశాస్త్రం సమూలంగా పరివర్తన చెందింది. చిన్న, చౌక, అత్యంత చురుకైన మానవరహిత వాయు వాహనాలదే (డ్రోన్లు) ఆధునిక సంఘర్షణల్లో నిర్ణాయక పాత్ర. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ దాడులు, మధ్యప్రాచ్య సంఘర్షణలు.. ఇవన్నీ ఒక అచ్చమైన సత్యాన్ని ప్రపంచానికి నిరూపించాయి. భవిష్యత్తు యుద్ధాలు డ్రోన్ల చేతుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం స్వదేశీ తయారీదారుల నుండి రెండు బిలియన్ డాలర్ల విలువైన డ్రోన్లను కొనుగోలు చేయనున్నట్టు కథనాలు రావడం.. భారత రక్షణ వ్యూహంలో మహత్తరమైన పరివర్తనకు సంకేతం కాకపోదు. స్వదేశీ తయారీకి నిబద్ధత, దేశీయ డ్రోన్ పరిశ్రమ వికాసానికి ప్రోత్సాహం.. ఇవి స్వాగతించదగిన పరిణామాలే! అయితే, ఈ నిధులు సరిగ్గానే ఖర్చవుతాయా? అన్న ప్రశ్న మాత్రం సమాధానం కోసం వేచి చూస్తోంది.

డ్రోన్ రంగంలో ఆర్థికశాస్త్రం విలక్షణంగా ఉంటుంది. సాధారణంగా రక్షణ చర్చల్లో ఎంక్యూ-9బీ రీపర్ లేదా బైరక్టర్ టీబీ-2 వంటి భారీ మానవరహిత యుద్ధ విమానాలే వెలుగులోకి వస్తాయి. కానీ ఆచరణలో నేటి యుద్ధభూముల్లో విజయాన్ని నిర్ణయిస్తున్నవి మైక్రో, నానోవర్గాల చిన్న డ్రోన్లే. వాటి తయారీ వ్యయం తక్కువ. పెద్ద సంఖ్యలో మోహరించవచ్చు. శత్రువు వాటిని అడ్డుకోవడానికి అయ్యే ఖర్చు డ్రోన్ వ్యయంకంటే ఎన్నో రెట్లు అధికం. ఇదే వాటి వ్యూహాత్మక శక్తి. ఇరాన్ అమెరికా మరియు ఇజ్రాయెల్‌పై డ్రోన్ దాడులు చేసినప్పుడు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వేల సంఖ్యలో డ్రోన్లు ఏకకాలంలో మోహరించినప్పుడు.. ఈ సిద్ధాంతం ఆచరణలో నిరూపితమైంది. మరీ ముఖ్యంగా, ఉక్రెయిన్ ఇంజినీర్లు వాణిజ్య అవసరాలకు తయారైన ఫస్ట్-పర్సన్-వ్యూ (ఎఫ్‌పీవీ) డ్రోన్లను యుద్ధాయుధాలుగా మార్చిన విధానం ప్రపంచ రక్షణ వర్గాలను ఆశ్చర్యపరచింది. అంతేకాదు, పౌర డ్రోన్ సాంకేతికత మరియు సైనిక డ్రోన్ సాంకేతికత మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతున్నదని నిరూపితమైంది. పరిశ్రమ, విద్యాసంస్థలు, సైన్యం మధ్య సన్నిహిత సహకారానికి చైనా డ్రోన్ పరిశ్రమ అద్భుతమైన నమూనాగా నిలుస్తున్నది. ఆ సహకార ఫలితంగానే చైనా నేడు ప్రపంచ డ్రోన్ మార్కెట్‌లో అగ్రస్థానంలో ఉంది. భారత్ కూడా ఇదే దిశగా ఆలోచించాల్సిన సమయమిది. డ్రోన్ సంగ్రహణలో అసలైన సవాలు వాటిని కొనడంలో లేదు, వాటిని సంబంధితంగా ఉంచడంలో ఉంది. ఇది మిగతా రక్షణ సంగ్రహణకు వ్యూహాత్మకంగా భిన్నమైన సమస్య. 2015లో కొనుగోలు చేసిన అత్యాధునిక యుద్ధ విమానం లేదా ట్యాంక్ నేటికీ సాపేక్షంగా కొత్తది, పోటీగా నిలబడగలదు. కానీ నేడు కొన్న అత్యుత్తమ డ్రోన్ రెండునుంచి మూడేళ్లలోనే వాడుకకు పనికిరానిది అయిపోవచ్చు -శత్రు సామర్థ్యాలు, ముప్పు పరిసరాలు నిరంతరం పరివర్తన చెందుతున్నందువల్ల. శత్రు ఎలక్ట్రానిక్ వార్ఫేర్ యూనిట్లు కొత్త డ్రోన్ సంకేతాలకు తమ జామర్లను కేవలం ఆరునుండి ఎనిమిది వారాల్లో అనుకూలపరచుకోగలవు. ఉక్రెయిన్ ఇంజినీర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నప్పుడు వేరే సంచార లింకులతో కొత్త వ్యవస్థలు కొనలేదు, బదులుగా రేడియో లింకులను ఫైబర్-ఆప్టిక్ కేబుళ్లతో మార్చారు. పరిష్కారం వేగంగా రావాలి; నిర్ణయాలు చురుగ్గా తీసుకోవాలి; అమలు ఆలస్యమైతే శత్రువు ముందే సిద్ధంగా ఉంటాడు. అధికార నిర్మాణాల ఆలస్యం, పాలనా సంక్లిష్టతలు ఈ రంగంలో అనర్థదాయకం. భారత సంగ్రహణ చట్రం ఈ దిశగా కొన్ని మంచి అడుగులు వేసింది నిజమే, ముసాయిదా రక్షణ సంగ్రహణ విధానం (డీఏపీ) వాణిజ్య-అఫ్-ది-షెల్ఫ్ (సీవోటీఎస్) వ్యవస్థల కొనుగోలుకు అనుమతిస్తున్నది; రక్షణ సంగ్రహణ మాన్యువల్ (డీపీఎం) అనుకోని మరమ్మత్తు, అప్‌గ్రేడ్ వ్యయాలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నది. ఇవి సవివేకమైన చర్యలే. కానీ ప్రస్తుత సంగ్రహణ చట్రాల ప్రధాన లోపమేమిటంటే.. కొనుగోలుదారు-విక్రేత సంబంధాలు ఇంకా కేవలం వ్యాపార లావాదేవీల స్థాయిలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఒక అవసరాన్ని గుర్తించి టెండర్ వేసి, అవసరాన్ని తీర్చే ఉత్పత్తిని కొనగలదు అన్న ధారణ పనికిరాని సందర్భాల్లో.. ముఖ్యంగా సాంకేతికత చాలా వేగంగా మారిపోయే రంగాల్లో ఇది స్పష్టంగా వెలుగులోకి వస్తున్నది.

అందుకే, భారత డ్రోన్ సంగ్రహణకు సరైన నమూనా.. కేవలం హార్డ్‌వేర్ కొనుగోలు కాదు. నిర్వహించబడిన సేవా ఒప్పందం అన్న భావన ముందుకు వస్తున్నది. పెద్ద సంస్థలు కంప్యూటర్లను కొనుగోలు చేసే తీరును పరిశీలిస్తే.. అవి కేవలం హార్డ్‌వేర్ కొనవు; అనుసరణ, సాఫ్ట్‌వేర్ నవీకరణలు, భర్తీ మద్దతు సహా దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకుంటాయి. సాయుధ బలగాలు డ్రోన్ తయారీదారులతో దీర్ఘకాలిక ఒప్పందాల్లో ప్రవేశించాలి. ఒప్పందాలు పరిశ్రమకు డిమాండ్ అంచనాను అందిస్తాయి; అదే సమయంలో నిరంతర సరఫరా, అప్‌గ్రేడ్ మార్గాలు, సంఘర్షణ సమయంలో ఉత్పత్తి వేగంగా పెంచే సామర్థ్యం కూడా నిర్ధారిస్తాయి. అత్యంత ముఖ్యంగా ఇవి సాయుధ బలగాలు మరియు పరిశ్రమ మధ్య నిరంతర పరిణామం కోసం సహకార చట్రాన్ని నిర్మిస్తాయి, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ ముప్పులకు అనుకూలంగా పనితీరు మెరుగుదలలు సాధిస్తాయి. ఒకే ఒక్కసారి డెలివరీ కంటే నిరంతర సామర్థ్యానికి ప్రాధాన్యత ఇచ్చే సంవిదా నిర్మాణమే.. రెండు బిలియన్ డాలర్ల రాజకీయ సంకల్పాన్ని నిజమైన వ్యూహాత్మక శక్తిగా మార్చే తార్కిక తదుపరి అడుగు. భారత స్వదేశీ డ్రోన్ పరిశ్రమ ఇప్పటికే ఆ స్థాయి సంబంధానికి తగిన సాంకేతిక పునాదిని కలిగి ఉంది. ఇక రాజకీయ సంకల్పం స్పష్టంగా వ్యక్తమైంది. ఆ సంకల్పాన్ని వ్యవస్థీకృత మార్పుల ద్వారా, భాగస్వామ్య దృక్పథంతో సరైన సంవిదా నిర్మాణంలోకి అనువదించడమే నేటి భారత రక్షణ రంగం ముందున్న అత్యున్నత సవాలు! ■



# అనుబంధమే.. అసలైన ఆస్తి


టార్గెట్లు, ప్రొడక్టివిటీ, పర్‌ఫార్మెన్స్ మెట్రిక్స్.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇవే మాటలు వినిపిస్తున్నాయి. అంకెల్లో విజయాన్ని కొలుస్తున్న ఈ కాలంలో, శాశ్వత విజయం మనుషుల మధ్య సంబంధాలపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేస్తుంది జేఆర్‌డీ టాటా చెప్పిన ఒక అద్భుతమైన మాట. "మంచి మానవ సంబంధాలు వ్యక్తిగతంగా గొప్ప సంతృప్తిని ఇవ్వడమే కాకుండా, ఏ సంస్థ విజయానికైనా అత్యంత కీలకం" అని భారత పారిశ్రామిక పితామహుడు స్పష్టంగా పేర్కొన్నారు. లాభాలు, టార్గెట్లు, ప్రమోషన్లు, వృద్ధి.. వీటితోనే విజయాన్ని కొలుస్తున్న రోజులివి. అయితే, ఏ విజయవంతమైన సంస్థ వెనుకైనా అంతకంటే బలమైన మానవ సంబంధాలుంటాయని టాటా బలంగా నమ్మారు. విజయం ఎప్పుడూ ఒంటరిగా సాధించేది కాదు, తోటివారితో కలిసి పనిచేసే విధానంపైనే ఉంటుంది. నమ్మకం, గౌరవం, సానుభూతి, పరస్పర సహకారం అనేవి కేవలం మంచి లక్షణాలు మాత్రమే కాదు; అవి వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు అత్యవసరమైన పెట్టుబడులు. మనుషుల మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడు ఆఫీసుల్లో స్వేచ్ఛా వాతావరణం ఏర్పడుతుంది. ఒకరినొకరు నమ్ముకున్నప్పుడు కమ్యూనికేషన్ మెరుగుపడుతుంది. టీమ్‌వర్క్ సులువవుతుంది. సవాళ్లను అధిగమించడం సాధ్యమవుతుంది. అదే సమయంలో, సంబంధాలు సరిగ్గా లేకపోతే తలెత్తే పొరపాట్లు, విభేదాలు సంస్థ ప్రగతిని అడ్డుకుంటాయి. మనుషులు కలిసికట్టుగా ఎదిగినప్పుడే సంస్థలు కూడా వృద్ధి చెందుతాయనేది టాటా సందేశం.

తమకు గౌరవం, గుర్తింపు దక్కుతున్నాయని భావించినప్పుడు ఉద్యోగులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తారు. సానుకూల వాతావరణంలో తోటి ఉద్యోగులతో, లీడర్లతో మంచి అనుబంధం ఉన్నవారు బాధ్యతగా పనిచేస్తారు. కొత్త ఆలోచనలతో ముందుకు వస్తారు. ఇలాంటి వాతావరణం సృజనాత్మకతను, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కాకుండా సంస్థపై ఉద్యోగులకు దీర్ఘకాలిక విధేయతను పెంచుతుంది. మరోవైపు, ఎంత గొప్ప ప్రణాళికలున్నా మనుషుల మధ్య సమ్మతి లేకపోతే అవి విఫలమవుతాయి. నమ్మకం లేని చోట నిర్ణయాలు ఆలస్యమవుతాయి, ఉత్పాదకత తగ్గుతుంది. వ్యాపారాలను నడిపేది ప్రక్రియలు కాదు, మనుషులేనని టాటా గుర్తించారు.

ఈ సూక్తం నేర్పే పాఠాలు స్పష్టంగా ఉన్నాయి. విజయం ఉమ్మడి కృషి ఫలితం; ఒంటరిగా సాధించేది కాదు. ఇతరులను గౌరవంగా, సమానత్వంతో చూడటం వల్ల నమ్మకం పెరుగుతుంది, వృత్తిపరమైన బంధాలు బలపడతాయి. ఎదుటివారి మాటలను శ్రద్ధగా వినడం, స్పష్టంగా మాట్లాడటం వల్ల పొరపాట్లను నివారించవచ్చు. కెరీర్, వ్యాపారాల లాగే మంచి సంబంధాలు ఏర్పడటానికి కూడా సమయం, ఓపిక, నిరంతర శ్రద్ధ అవసరం. బలమైన మానవ సంబంధాలు ఇచ్చే తృప్తి, తోడ్పాటు కేవలం ఆర్థిక విజయాల వల్ల మాత్రమే లభించవు.

జేఆర్‌డీ టాటా మాటలు నేటికీ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేవలం తెలివితేటలు, కష్టపడే తత్వం లేదా ఆశయాలు మాత్రమే విజయాన్ని నిర్ణయించవు అనే నిజాన్ని ఆయన మాటలు గుర్తుచేస్తున్నాయి. శాశ్వత విజయం కేవలం ఐడియాల మీదో, వాటిని అమలు చేయడం మీదో మాత్రమే ఆధారపడి ఉండదు.. మనం ఇతరులతో ఎలా ప్రవర్తిస్తాం అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.

దాదాపు ఐదు దశాబ్దాల పాటు టాటా గ్రూప్‌ను విజయవంతంగా నడిపించి, ఎయిర్ ఇండియాను ప్రారంభించి, నైతిక వ్యాపార పద్ధతులకు ప్రతీకగా నిలిచిన జేఆర్‌డీ టాటా.. వ్యాపారం, నాయకత్వం, దైనందిన జీవితం అన్నిటా మంచి మానవ సంబంధాలే అత్యంత విలువైన ఆస్తి అని నిరూపించారు.



కష్టపడితేనే.. ఏదైనా!

పిల్లల్ని పెంచడం, కొత్త వ్యాపారం ప్రారంభించడం, కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం, తప్పులను ఒప్పుకోవడం, బంధాలను నిలబెట్టుకోవడం, రోజూ వ్యాయామం చేయడం.. ఇలా జీవితంలో మనం సాధించాలనుకునే ప్రతి మంచి విషయం వెనుక కష్టం అనేది ఉంటుంది. అందుకే, జీవితంలో ఏ గొప్ప విలువైన వస్తువు లేదా విజయం మనకు దక్కాలన్నా.. దాని వెనుక ఉన్న కష్టాన్ని చూసి భయపడకండి. 'ఎలాగైనా సాధించాలి' అనే పట్టుదలతో దాన్ని ఒక సవాలుగా తీసుకోండి. అది కష్టమేగానీ, అసాధ్యమైతే కాదు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# రోబో బిచ్చగాళ్లు!



చైనా వీధుల్లో అనూహ్యమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి. బీజింగ్, చెంగ్డు, ఫుఝౌ నగరాల్లో అత్యాధునిక హ్యూమనాయిడ్ రోబోలు మోకాళ్లపై కూర్చుని, తలవంచుకుని భిక్షాటన చేస్తున్నాయి! "నా ఫోన్ చార్జ్ చేయడానికి డబ్బు లేదు", "దయచేసి నా కరెంట్ బిల్లు కట్టండి" అని బోర్డులు పట్టుకుని, పక్కనే క్యూఆర్ కోడ్ పేమెంట్ సదుపాయం కూడా! యునీట్రీ వంటి ప్రముఖ కంపెనీల అత్యంత ఖరీదైన రోబోలు ఇలా వీధుల్లో కూర్చోవడం చూసి చైనా నెటిజన్లలో తీవ్ర చర్చ రేగింది. ఇవి నిజమైన ట్రెండా, కళాత్మక స్టేట్‌మెంటా? అని. ఏఐతో ఉద్యోగాలు పోతాయని భయపడ్డాం... బిచ్చగాళ్ల వృత్తిని కూడా రోబోలు ఆక్రమిస్తారని ఊహించామా?!

# హైదరాబాద్ దిగుతోంది



టీజీ20 లీగ్‌లో అత్యంత ఖరీదైన జట్టు.. లీగ్‌కు కేంద్రమైన హైదరాబాద్ నగరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్.. వేలంలో వ్యూహాత్మకంగా రెండంకెల సంఖ్యలో ఆల్‌రౌండర్లను ఎంచుకుని బలంగా తయారైన జట్టు.. మైదానంలోకి అడుగు పెడుతోంది. టోర్నీలో మూడో రోజు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తన తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్‌ను ఢీకొనబోతోంది. పాలమూరు ఇప్పటికే ఒక మ్యాచ్ ఆడి ఖమ్మం చేతిలో ఓటమి పాలైంది. ఆ జట్టు పుంజుకోవాలని చూస్తుండగా.. హైదరాబాద్ విజయంతో టోర్నీని ఆరంభించాలని పట్టుదలతో ఉంది.

టీజీ20 లీగ్‌లో తన తొలి మ్యాచ్‌లో మంగళవారం పాలమూరును ఢీకొంటున్న హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టులో సగం మందికి పైగా ఆల్‌రౌండర్లే ఉండడం విశేషం. రంజీల్లో ఆడిన అనుభవమున్న అభిరథ్‌రెడ్డి సారథ్యంలో ఆ జట్టు బరిలోకి దిగుతోంది. అభిరథ్ ఈ ఏడాది జనవరిలో రంజీ మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్‌పై శతకం (121) సాధించాడు. వేలంలో రూ.11 లక్షలు పలికిన అతడిపై బ్యాటర్‌గా, సారథిగా మంచి అంచనాలే ఉన్నాయి. అంతే ధర దక్కించుకున్న అజయ్‌దేవ్ గౌడ్ కూడా జట్టులో విలువైన ఆటగాడే. ఆల్‌రౌండరైన అజయ్‌కి భారత అండర్-19 జట్టుకు ఆడిన అనుభవముంది. ఎడమ చేతి వాటం స్పిన్నర్ ప్రణవ్ వర్మ ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు నెట్ బౌలర్‌గా వ్యవహరించాడు.. ఓపెనింగ్‌లో సాయివికాస్‌రెడ్డిపై భారీ అంచనాలున్నాయి.దూకుడుగా ఆడే అతడు బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న ఉప్పల్ స్టేడియంలో చెలరేగుతాడని జట్టు ఆశిస్తోంది. గడుగు గణేశ్ మంచి హిట్టర్. బంతితోనూ రాణించగలడు. వేలంలో ఈ ఛాంపియన్స్‌కు ఎంపికయ్యాక భారత అండర్-19 జట్టుకు సెలక్ట్ అయిన యశ్వీర్ గౌడ్‌పై అందరి దృష్టి నిలిచి ఉంది. ఆల్‌రౌండరైన ఈ కుర్రాడు ఒకటి లేదా రెండు మ్యాచ్‌ల్లోనే ఆడే అవకాశముంది. ఈలోపు అతడెలాంటి ముద్ర వేస్తాడో చూడాలి. పేసర్ అఖిల్ రాథోడ్ వేగంగా బంతులేస్తాడు. అతడికి బ్యాటుతోనూ చెలరేగే సత్తా ఉంది. తరుణ్ రాజన్, షణ్ముఖ మురుగన్, శ్రీనికేత్, ప్రేమ్ చరణ్, గుడెల్లి జశ్వంత్, ప్రత్యూష్ కుమార్, ఎమ్ఎమ్ చరణ్.. ఇలా నిండా ఆల్‌రౌండర్లతో హైదరాబాద్ జట్టు శక్తిమంతంగా కనపిస్తోంది.పి.అరవింద్ రూపంలో హిట్టింగ్ చేయగల వికెట్ కీపర్ బ్యాటర్ జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అన్విత్ రెడ్డి, వైష్ణవ్ రెడ్డి కూడా ఆకట్టుకోగలరు.

# ఇక కంగారే..



క్రికెట్లో ప్రపంచకప్ అంటే.. భారత పురుషుల జట్టుపై ఉన్నంత అంచనాలు అమ్మాయిల మీద ఉండేవి కావు ఒకప్పుడు. అమ్మాయిలూ కప్పు గెలిస్తే బాగుంటుందనే ఆశ తప్ప.. మన జట్టు గెలుస్తుందనే ధీమా ఉండేది కాదు. కానీ గత ఏడాది వన్డే ప్రపంచకప్‌లో అద్భుత విజయంతో తమపై ఉన్న అభిప్రాయాన్ని మార్చేసింది హర్మన్‌ప్రీత్ సేన. దీంతో ప్రస్తుత టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుపై భారీ అంచనాలే నెలకొన్నాయి. ఆ అంచనాలను అందుకుంటూ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘనవిజయాలు సాధించిన అమ్మాయిలు.. కీలక సమరంలో నిరాశపరిచారు. దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో.. పొట్టి కప్పులో సెమీస్ చేరకుండానే నిష్క్రమించే ప్రమాదంలో పడింది ఇండియా.

చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఘనవిజయం.. పసికూన నెదర్లాండ్స్‌లో భారీ గెలుపు.. ఇలా టీ20 ప్రపంచకప్‌లో భారత అమ్మాయిల ప్రయాణం ఆశాజనకంగానే మొదలైంది. కానీ సెమీస్ రేసులో ఎంతో కీలకమైన దక్షిణాఫ్రికా పోరులో మాత్రం అమ్మాయిలు అంచనాలను అందుకోలేకపోయారు. బ్యాటింగ్ వైఫల్యంతో ముందే విజయంపై సందేహాలు కలగగా.. బౌలింగ్‌లో శుభారంభం దక్కినా జట్టు ఉపయోగించుకోలేకపోయింది. ఈ ఓటమి భారత్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బే. ప్రపంచకప్‌లో రెండు గ్రూప్‌ల నుంచి రెండేసి జట్లు సెమీస్ చేరతాయి. భారత్ ఉన్న గ్రూప్-1లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ గ్రూప్ దశలోనే నిష్క్రమించడం లాంఛనమే! దుర్భేద్యమైన ఆస్ట్రేలియా సెమీస్‌కు ముందు నుంచి ఫేవరెట్‌గా ఉంది. దక్షిణాఫ్రికాపై ఘనవిజయంతో టోర్నీని ఆరంభించిన ఆ జట్టు.. తర్వాత నెదర్లాండ్స్‌నూ చిత్తు చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్‌ల్లోనూ ఆ జట్టుకు ఎదురుండకపోవచ్చు.ఆస్ట్రేలియా ఒక సెమీస్ బెర్తును చేజిక్కించుకుంటే.. రెండో బెర్తు కోసం భారత్, దక్షిణాఫ్రికాల మధ్య పోటీ ఉంటుందని భావించారంతా. వీటి ముఖాముఖి పోరులో గెలిచే జట్టే రెండో స్థానంతో ముందంజ వేస్తుందని అంచనా వేశారు. కానీ ఈ పోరులో భారత్ ఓడిపోయింది. దక్షిణాఫ్రికా సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఇక హర్మన్‌ప్రీత్ సేన సెమీస్ చేరడం అంత తేలిక కాదు. తర్వాతి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఘనంగా గెలవడంతో పాటు చివరి పోరులో ఆస్ట్రేలియాను ఓడిస్తేనే భారత్‌కు అవకాశాలుంటాయి. మరోవైపు దక్షిణాఫ్రికా.. నెదర్లాండ్స్ లేదా బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవాలని కోరుకోవాలి. ఒకవేళ పాయింట్లలో ఆస్ట్రేలియా లేదా దక్షిణాఫ్రికాతో సమం అయినా.. నెట్ రన్‌రేట్‌లో వెనుకబడకుండా చూసుకోవడమూ భారత్‌కు అవసరమే. చివరి పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓడితే మాత్రం భారత్ కథ ముగిసినట్లే!

**అసాధ్యం కాదు కానీ..**

పొట్టి ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియానే అత్యుత్తమ జట్టనడంలో ఎవరికీ సందేహాలు లేవు. ఆ జట్టుకున్న ఆల్‌రౌండ్ బలం మరే టీమ్‌కూ లేదు. అయితే ప్రపంచకప్‌నకు రెండు నెలల ముందే భారత్.. కంగారూలను టీ20 సిరీస్‌లో వారి గడ్డపైనే ఓడించింది. నిరుడు వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై అమ్మాయిలు ఎంత గొప్ప విజయం సాధించారో తెలిసిందే. ఆ జట్టును ఓడించడం కష్టమే కానీ, అసాధ్యం మాత్రం కాదు. కానీ జట్టు సమష్టిగా రాణించడం.. కీలక క్రికెటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం కీలకం. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినా బ్యాటర్లు అంచనాలను అందుకోలేదు. చిన్న జట్లపై చెలరేగిన స్మృతి.. సఫారీలపై విఫలమైంది. షెఫాలి ప్రదర్శన పర్వాలేదు. హర్మన్‌ప్రీత్, జెమీమా నిరాశ పరుస్తున్నారు. నాలుగో స్థానంలో భార్తీ, యాస్తికలిద్దరూ విఫలమయ్యారు. బౌలింగ్‌లో స్పిన్నర్లు శ్రీచరణి, దీప్తిల మీదే భారం పడుతోంది. పేస్‌లో భారత్ బలహీనంగా కనిపిస్తోంది. నందని తప్పితే నమ్మదగ్గ బౌలర్ లేరు. ఫీల్డింగ్ వైఫల్యమూ జట్టును దెబ్బ తీస్తోంది. అన్ని విభాగాల్లోనూ భారత్ మెరుగు పడాల్సిందే.



# జక్కన్న టేబుల్ ప్రాఫిట్.. ఈసారి కెరీర్ లోనే టాప్?



దర్శకధీరుడు రాజమౌళి సినిమా అంటే ఆడియన్స్ లో ఎంత క్రేజ్ ఉంటుందో, ట్రేడ్ వర్గాల్లో కూడా అంతే నమ్మకం ఉంటుంది. ఆయన సినిమా విడుదలకు ముందే డీల్స్ ద్వారా భారీ బిజినెస్ జరగడం కొత్త విషయం కాదు. అయితే ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న వారణాసి విషయంలో ఆ రేంజ్ మరింత పెరిగే అవకాశం ఉందని ఇప్పుడు చర్చ జరుగుతోంది.అయితే సినీ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపించే పదం టేబుల్ ప్రాఫిట్. అంటే మూవీ ప్రొడక్షన్ కు అయిన ఖర్చు కంటే, విడుదలకు ముందే థియేట్రికల్, డిజిటల్, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటే నిర్మాతలు ముందుగానే లాభాల్లోకి వెళ్లినట్లే. అలాంటి సిచ్యువేషన్ నే టేబుల్ ప్రాఫిట్ గా ట్రీట్ చేస్తారు. రాజమౌళి కెరీర్ ను పరిశీలిస్తే ఆ ట్రెండ్ చాలా కాలంగా కనిపిస్తోంది.

ఆయన కెరీర్ స్టార్టింగ్ నుంచి బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లలో మంచి నమ్మకం ఏర్పడింది. వరుస విజయాలతో ఆ నమ్మకం మరింత బలపడింది. దీంతో ప్రతి కొత్త సినిమాకు గత చిత్రం కంటే ఎక్కువ బిజినెస్ జరగడం కామన్ అయిపోయింది. మగధీర, ఈగ వంటి చిత్రాల సమయంలో రాజమౌళి మార్కెట్ బాగా పెరిగింది. ఆ తర్వాత వచ్చిన బాహుబలి సిరీస్ ఇండియన్ సినిమా మార్కెట్ ను పూర్తిగా మార్చేసింది.ముఖ్యంగా బాహుబలి 2 విడుదలకు ముందే రైట్స్ రూపంలో భారీ ఆదాయం సాధించింది. ఆ సినిమా తర్వాత రాజమౌళి బ్రాండ్ వాల్యూ ఇంటర్నేషనల్ లెవెల్ కు చేరుకుంది. ఆర్ఆర్ఆర్ మూవీతో ఆ క్రేజ్ మరోసారి రుజువైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర లాంగ్వేజెస్, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా ఆ చిత్రానికి భారీ డిమాండ్ కనిపించింది. డిజిటల్, శాటిలైట్, థియేట్రికల్ రైట్స్ ద్వారా విడుదలకు ముందే పెద్ద మొత్తంలో బిజినెస్ జరిగింది.ఇప్పుడు అదే అంచనాలు వారణాసిపై కనిపిస్తున్నాయి. మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఆ సినిమా ఇప్పటికే పాన్ ఇండియా రేంజ్ లో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. అఫీషియల్ గా కంప్లీట్ బిజినెస్ డిటైల్స్ బయటకు రాకపోయినా, ఓటీటీ రైట్స్ కోసం బడా ప్లాట్ ఫామ్స్ ఆసక్తి చూపుతున్నాయనే ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. మేకర్స్ ఒక్క ఓటీటీ డీల్ ద్వారానే రూ.500 కోట్లు ఆశిస్తున్నట్లు వినికిడి.అయితే వారణాసి బడ్జెట్ రూ.1000 కోట్ల రేంజ్ లో ఉండొచ్చని ఇప్పటికే వార్తలు వచ్చాయి. దీంతో ఓటీటీ డీల్ వాల్యూ రూ.500 కోట్లు అయితే.. మిగతా డీల్స్ తోనూ పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయి. దీంతో రాజమౌళి బ్రాండ్, మహేష్ బాబు స్టార్ డమ్ కలిసి రావడంతో విడుదలకు ముందే రికార్డు లెవెల్ బిజినెస్ జరిగి.. భారీ టేబుల్ ప్రాఫిట్ తీసుకురావచ్చనే అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో గతంలో రాజమౌళి సినిమాలు సాధించిన బిజినెస్ రికార్డులు చూస్తే, వారణాసి వాటిని బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఒక విషయం మాత్రం క్లియర్ గా కనిపిస్తోంది. విడుదలకు ముందే భారీ బిజినెస్ జరగడం రాజమౌళి సినిమాలకు అలవాటైపోయింది. అదే ట్రెండ్ కొనసాగితే వారణాసి ఆయన కెరీర్ లోనే హైయెస్ట్ టేబుల్ ప్రాఫిట్ సాధించిన చిత్రంగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com